www.hamsakalam.com
PRGI: TGTEL/26/A3129
సంచలన తెలుగు దినపత్రిక
# హంస కలం వార్త
HAMSA KALAM VARTA
చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి



EDITOR :VADLA MADHUSUDHAN CHARY   MEDCHAL /MALKAJGIRI   VOLUME:1   ISSUE:20   SATURDAY ,MAY 30,2026   PAGES:8   COST: 4 /-

ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి   మేడ్చల్ /మల్కాజిగిరి   సంపుటి : 1   సంచిక : 20   శనివారం 30 మే 2026   పేజీలు :8   వెల: 4/-

## యూపీఎస్‌సీని చూసి నేర్చుకోండి.. నీట్ పేపర్ లీక్ పై 'సుప్రీం' వ్యాఖ్య



హంసకలం వార్త మే 29

నీట్ పేపర్ లీక్ ఉదంతం పై విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు తాజాగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పై (ఎన్‌టీఏ) పలు ప్రశ్నలు సంధించింది. ఇన్ని నిఘా వ్యవస్థలు, కమిటీలు ఉన్నా పేపర్ ఎలా లీకైందని ప్రశ్నించింది. సివిల్స్ పరీక్షలు నిర్వహించే యూపీఎస్‌సీలో ఇలాంటి ఉదంతాలు ఎప్పుడూ వెలుగుచూడలేదని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. - మిగతా2లో

## పేలిపోయిన న్యూ గ్లెన్ రాకెట్.. ఎక్స్ వేదికగా స్పందించిన బ్లూ ఆరిజిన్..



హంసకలం వార్త మే 29

ఫ్లోరిడాలోని కేప్ కెనవరల్‌లో గురువారం నాడు బ్లూ ఆరిజిన్‌కు చెందిన న్యూ గ్లెన్ రాకెట్ పేలిపోయింది. ప్రయోగ వేదిక నుంచి అంతరిక్షంలోకి పంపేందుకు సిద్ధమవుతుండగా ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. అయితే, ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదని బ్లూ ఆరిజిన్ సంస్థ తెలిపింది. హాట్ ఫైర్ పరీక్ష - మిగతా2లో

## తడిసిన ధాన్యం సహా ప్రతి గింజనూ కొంటాం: ఉత్తమ్ కుమార్ రెడ్డి



హంసకలం వార్త మే 29

ధాన్యం కొనుగోళ్ల అంశం పై ప్రతిపక్షాలు కావాలనే రాజకీయ విమర్శలు చేస్తున్నాయని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. ఈ ఏడాది తెలంగాణ ప్రభుత్వం వరి కొనుగోలు కోసం చేస్తున్నంత ఖర్చు భారతదేశ చరిత్రలో ఏనాడూ ఏ ప్రభుత్వమూ చేయలేదని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని స్వయంగా కేంద్ర ప్రభుత్వమే అంగీకరించిందని గుర్తు చేశారు. - మిగతా2లో

# ఉద్యోగులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం

హంసకలం వార్త మే 29

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు కాంగ్రెస్ సర్కారు శుభవార్త చెప్పింది. పెండింగ్ బకాయిల తొలి విడత మొత్తాన్ని విడుదల చేశారు. ఉద్యోగుల సుదీర్ఘకాల బకాయిలను కేవలం 100 రోజుల్లో రూ.6,000 కోట్లు విడుదల చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క ఉద్యోగ జేఏసీ నాయకులకు స్పష్టమైన హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ హామీని నెరవేర్చే దిశగా, రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఈరోజు తొలి విడతగా రూ. 2,000 కోట్ల నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. - మిగతా2లో



## ప్రతి ఓటును కాపాడుకోవాలి: మహేశ్ కుమార్ గౌడ్



హంసకలం వార్త మే 29

దేశంలోని పలు రాష్ట్రాల్లో ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘం ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్)ను పూర్తి చేసిన సంగతి తెలిసిందే. మిగిలిపోయిన రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ ప్రక్రియను - మిగతా2లో

## స్టేషన్ ఘన్ పూర్ మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశానికి హాజరైన కడియం శ్రీహరి



2

- నూతన కో ఆప్షన్ సభ్యులను సత్కరించిన శ్రీహరి
- ఒక్కో వార్డుకు రూ. 10 లక్షలు మంజూరు చేయనున్నట్టు వెల్లడి
- వార్డులో అవసరమైన పనులను గుర్తించాలని సూచన

## పవన్ కల్యాణ్ పై జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఫైర్

హంసకలం వార్త మే 29

ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. పవన్‌ను ఒక 'ప్యాకేజ్ స్టార్' అని అభివర్ణిస్తూ, భవిష్యత్తులో వైఎస్ జగన్ ఎక్కువ ప్యాకేజీ ఇస్తే ఆయనకు మద్దతు ఇవ్వడానికి కూడా వెనుకాడరని ఎద్దేవా చేశారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయంగా కలకలం రేపుతున్నాయి ప్రముఖ - మిగతా2లో



## హైడ్రాలో 16 మంది ట్రాన్స్‌జెండర్లకు ఉద్యోగాలు... 'ఈగిల్ టీమ్' పేరిట విధులు

హంసకలం వార్త మే 29

తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఓ వినూత్న నిర్ణయం, సమాజంలో మార్పునకు నాంది పలుకుతోంది. హైడ్రాలో 16 మంది ట్రాన్స్‌జెండర్లకు ఉద్యోగాలు కల్పించి, వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపింది. ఈ చొరవ ద్వారా వారికి గౌరవప్రదమైన జీవనోపాధిని అందించి, ప్రభుత్వ - మిగతా2లో



## సిద్ధరామయ్య రాజీనామా.. పదవుల కన్నా పార్టీయే గొప్పదన్న కాంగ్రెస్

హంసకలం వార్త మే 29

కర్ణాటక ముఖ్యమంత్రి పదవికి సిద్ధరామయ్య రాజీనామా చేసిన నేపథ్యంలో రాష్ట్ర రాజకీయాల్లో పరిణామాలు వేగంగా మారుతున్నాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ పదవుల కన్నా పార్టీకి, ప్రజలకే అధిక ప్రాధాన్యత ఇస్తుందని - మిగతా2లో



హంస కలం వార్త HAMSA KALAM VARTA



# తడిసిన ధాన్యం సహా ప్రతి గింజనూ కొంటాం: ఉత్తమ్ కుమార్ రెడ్డి

-మొదటిపేజీ తరువాయి

2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను దేశవ్యాప్తంగా వరి కొనుగోళ్లు జరపడంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిచిందని మంత్రి వెల్లడించారు. రైతులను ఆదుకుంటామంటూ బీజేపీ నాయకులు క్షేత్రస్థాయిలో నాటకీయ నిరసనలు చేస్తున్నారని ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరల విధానం ప్రకారమే తాము ధాన్యాన్ని సేకరిస్తున్నామని, రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ యాసంగి సీజన్ పంటలో రాష్ట్రవ్యాప్తంగా 141 లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యం పండిందని, అందులో 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేశామన్నారు. అయితే, కేంద్ర ప్రభుత్వం ఇందులో కేవలం 52 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేస్తామని ముందే చెప్పిందని వెల్లడించారు. మిగిలిన అదనపు ధాన్యాన్ని రైతుల ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వమే అప్పు చేసి మరి కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తోందని స్పష్టం చేశారు. ఈ యాసంగి పంటలో ఇప్పటివరకు రికార్డు స్థాయిలో 62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు మంత్రి తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా రాష్ట్రవ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, అక్కడ రైతులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించామని పేర్కొన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి ఇప్పటికే రూ.13,050 కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడించారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. ధాన్యం రవాణాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇసుక లారీలను, అలాగే ఇతర ఫ్యాక్టరీల్లో నడిచే భారీ వాహనాలను కూడా ధాన్యం సేకరణకు ఉపయోగించాలని భావిస్తున్నట్లు మంత్రి చెప్పారు. ఇందుకోసం వాహనాలను కేటాయించాలని ఆయా యాజమాన్యాలను కోరినట్లు తెలిపారు. అయితే, ప్రస్తుతం హమాలీల కొరత కొంత వేధిస్తోందని, బీహార్, బెంగాల్ రాష్ట్రాల నుంచి వచ్చే వలస కార్మికులపైనే ఇందుకు ఎక్కువగా ఆధారపడాల్సి వస్తోందని మంత్రి వివరించారు. ఈ ఇబ్బందులను కూడా అధిగమించి కొనుగోలు ప్రక్రియను వేగంగా పూర్తి చేస్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# పేలిపోయిన న్యూ గ్లెన్ రాకెట్.. ఎక్స్ వేదికగా స్పందించిన బ్లూ ఆరిజిన్..

-మొదటిపేజీ తరువాయి

సమయంలో అసాధారణ పరిస్థితిని ఎదుర్కొన్నామని.. సిబ్బంది అందరూ సురక్షితంగానే ఉన్నారని ఎక్స్ వేదికగా పోస్టు చేసింది. న్యూ గ్లెన్ రాకెట్ లాంచింగ్‌కు సిద్ధంగా ఉండగా కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. అయితే, ఆకాశంలోకి దూసుకెళ్లాల్సిన క్షణాలకు ముందే రాకెట్ దిగువ భాగం నుంచి దట్టమైన పొగ వచ్చింది. క్షణాల వ్యవధిలోనే పేలుడు సంభవించి భారీ అగ్నిగోళం ఏర్పడింది. దీంతో ప్రయోగ వేదిక మొత్తం మంటల్లో చిక్కుకుంది. ఈ ప్రమాదానికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ ప్రమాదంపై బ్లూ ఆరిజిన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ స్పందించారు. 'ఇది చాలా కఠినమైన రోజు. అవసరమైన ప్రతిదాన్ని మళ్లీ నిర్మించి, తిరిగి ప్రయోగాలకు సిద్ధమవుతాం. అంతరిక్ష ప్రయాణం కోసం ఈ ప్రయత్నం విలువైనదే' అంటూ ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. మరోవైపు ఈ ఘటనపై స్పేస్ ఎక్స్ వ్యవస్థాపకుడు ఎలాన్ మస్క్ స్పందించారు. ఈ ప్రమాదం చాలా దురదృష్టకరమని పేర్కొన్నారు. న్యూ గ్లెన్ పేలుడుపై ఫ్లోరిడాకు చెందిన కాంగ్రెస్ సభ్యుడు మైక్ హారిడోపోలోస్ కూడా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదానికి సంబంధించి నాసా అడ్మినిస్ట్రేటర్ జారెడ్ ఐజాక్‌మన్‌తో తాను సంప్రదింపులు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు. నాసా, బ్లూ ఆరిజిన్ కలిసి ఆర్టెమిస్ చంద్రయాన్ మిషన్ల కోసం లూనార్ ల్యాండర్ అభివృద్ధిపై పనిచేస్తున్నాయి. దీంతో ప్రమాదంపై నాసా కూడా దర్యాప్తును పర్యవేక్షించనున్నట్లు తెలుస్తోంది. ఈ తాజా పేలుడుతో బ్లూ ఆరిజిన్ సంస్థకు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. భవిష్యత్ అంతరిక్ష వాణిజ్యం, చంద్రయాన్ మిషన్లలో న్యూ గ్లెన్ రాకెట్ కీలక పాత్ర పోషించాల్సి ఉంది. అయితే, ఈ ఘటనతో బ్లూ ఆరిజిన్ సంస్థ ప్రణాళికలు మరింత ఆలస్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# స్టేషన్ ఘన్ పూర్ మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశానికి హాజరైన కడియం శ్రీహరి

-మొదటిపేజీ తరువాయి

స్టేషన్ ఘన్ పూర్ మున్సిపల్ కార్యాలయంలో జరిగిన మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరయ్యారు. ఈ సందరధంగా మున్సిపాలిటీ నూతన కో ఆప్షన్ సభ్యులుగా ఎన్నికైన రహీమున్నిసా, మాషుఖ్, గన్ను నర్సింహులు, బూర్ల లతలను శాలువాతో సత్కరించారు. మరోవైపు, నూతన కోఆప్షన్ సభ్యులకు మున్సిపల్ కమిషనర్ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ... కౌన్సిల్ లో ఓటు వేసే హక్కు తప్ప కౌన్సిలర్లకు ఉండే అన్ని హక్కులు కో ఆప్షన్ సభ్యులకు ఉంటాయని తెలిపారు. నూతనంగా ఎన్నికైన కో ఆప్షన్ సభ్యులకు జూన్ 15 నాటికి ఒక్కో వార్డుకు రూ. 10 లక్షలు మంజూరు చేయనున్నట్టు చెప్పారు. మీ వార్డులో అవసరమైన పనులను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ ఎన్నికలకు ముందే స్టేషన్ ఘన్ పూర్ కి రూ. 50 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని... రూ. 8 కోట్ల జనరల్ ఫండ్ ఉందని శ్రీహరి తెలిపారు. జీతాలు ఇవ్వలేని పరిస్థితి నుంచి ఇప్పుడు దాదాపు రూ. 60 కోట్ల నిధులతో స్టేషన్ ఘన్ పూర్ మున్సిపాలిటీ సంపన్నంగా ఉందని అన్నారు. ప్రతి నెల ఒకటో తేదీన సిబ్బందికి జీతాలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఏప్రిల్, మే నెల పెండింగ్ జీతాలను కూడా జూన్ 1న చెల్లించాలని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా అవినీతి రహిత పాలనను అందిస్తూ మున్సిపాలిటీని అభివృద్ధి చేసుకుందామని అన్నారు.

# హైడ్రాలో 16 మంది ట్రాన్స్‌జెండర్లకు ఉద్యోగాలు... 'ఈగిల్ టీమ్' పేరిట విధులు

-మొదటిపేజీ తరువాయి

ఈ బృందంలో 11 మంది ట్రాన్స్ మహిళలు, ఐదుగురు ట్రాన్స్ పురుషులు ఉన్నారు. హైదరాబాద్, చుట్టుపక్కల ప్రాంతాల్లో చెరువులు, ప్రభుత్వ భూములపై అక్రమ కట్టడాలను తొలగించడంలో వీరు చురుగ్గా పాల్గొంటున్నారు. కబ్జాదారులు ఎంతటి పలుకుబడి ఉన్నవారైనా భయపడకుండా, నిర్భయంగా తమ విధులను నిర్వర్తిస్తున్నారు. వీరిని 'హైడ్రా ఈగిల్ టీమ్'గా పిలుస్తున్నారు. ఈ ఉద్యోగం తమకు కేవలం జీవనోపాధి మాత్రమే కాదని, జీవితానికి కొత్త గుర్తింపును, ఆత్మగౌరవాన్ని ఇచ్చిందని వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. హైడ్రా యూనిఫాం ధరించి విధులకు హాజరవడం తమకు ఎంతో గర్వకారణమని చెబుతున్నారు. ఇటీవల సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలంలోని ఐలాపూర్‌లో 862 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని, మాదాపూర్‌లోని ఎదులకుంట చెరువును కబ్జాదారుల బారి నుంచి కాపాడటంలో ఈ బృందం కీలక పాత్ర పోషించింది. కబ్జాల తొలగింపు సమయంలో ప్రజలకు నచ్చజెప్పడం, మహిళలతో మాట్లాడి ఉద్రిక్తతలు తగ్గించడం, అధికారులు-ప్రజల మధ్య సమన్వయం చేయడంలో వీరు అద్భుతమైన నైపుణ్యం ప్రదర్శిస్తున్నారని హైడ్రా అధికారులు తెలిపారు. క్షేత్రస్థాయిలో అద్భుత ఫలితాలు సాధిస్తున్నారని ప్రశంసించారు. "గతంలో బతుకుదెరువు కోసం అడుక్కునేవాళ్లం. ఎక్కడికి వెళ్లినా హేళన చేసేవారు. పని అడిగితే ముఖం మీదే లేదనేవారు. కానీ, ఇప్పుడు యూనిఫాంలో విధులకు వెళుతుంటే అందరూ మర్యాదగా మాట్లాడుతున్నారు" అని తాన్ని రాయ్ ఆనందంగా చెప్పారు. "అవకాశం ఇస్తే ట్రాన్స్‌జెండర్లు ఏ రంగంలోనైనా రాణించగలరు. హైడ్రాలో మా విధులే దీనికి నిదర్శనం. ఇక్కడ అధికారులు, ఇతర సిబ్బంది మమ్మల్ని సమానంగా చూస్తారు" అని గాయత్రి తెలిపారు. ఈ ఉద్యోగం వల్ల వీరు ఇప్పుడు ఆర్థికంగా స్థిరపడి, తమ కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. అన్నిటికంటే ముఖ్యంగా 'మేము కూడా సమాజానికి సేవ చేయగలం' అనే ఆత్మవిశ్వాసం వారిలో వెల్లివిరుస్తోంది.

# సిద్ధరామయ్య రాజీనామా.. పదవుల కన్నా పార్టీయే గొప్పదన్న కాంగ్రెస్

-మొదటిపేజీ తరువాయి

సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' లో ఆయన ఒక పోస్ట్ చేశారు. "వ్యక్తి కన్నా పార్టీ గొప్పది, అధికారం కన్నా ప్రజలే ముఖ్యం. ఎందుకంటే కాంగ్రెస్‌కు పార్టీయే కుటుంబం, ప్రజలే మా లక్ష్యం" అని అందులో పేర్కొన్నారు. సిద్ధరామయ్య రాజీనామాను కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ ఆమోదించారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసే వరకు ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాలని ఆయనను కోరారు. కర్ణాటకలో చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాల మధ్య పార్టీ క్రమశిక్షణ, సమష్టి నాయకత్వాన్ని చాటిచెప్పేందుకే వేణుగోపాల్ ఈ వ్యాఖ్యలు చేసినట్లు భావిస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి ప్రియాంక్ ఖర్గే మాట్లాడుతూ.. సంక్షేమ పాలన, సైద్ధాంతిక నిబద్ధత, రాజకీయ పోరాటాలతో ప్రజల ప్రేమను, నమ్మకాన్ని గెలుచుకున్న నేత సిద్ధరామయ్య అని ఆయన కొనియాడారు. కర్ణాటకలో ఎక్కువ కాలం పనిచేసిన ముఖ్యమంత్రుల్లో ఒకరిగా రికార్డు సృష్టించారని, కాంగ్రెస్ పార్టీ ప్రజానుకూల కార్యక్రమాలతో ఆయన ప్రజల నాయకుడిగా ఎదిగారని అన్నారు. "రాజ్యాంగ విలువలు, లౌకికవాదం, సామ్యవాద సూత్రాలకు కట్టుబడి ఆయన ఉన్నత ప్రమాణాలను నెలకొల్పారు. మా తరం నేతలకు, భవిష్యత్ యువ రాజకీయ నాయకులకు ఆయన ఒక స్ఫూర్తి" అని ప్రియాంక్ ఖర్గే పేర్కొన్నారు. తన రాజకీయ ప్రస్థానంలో సిద్ధరామయ్య మార్గదర్శకత్వాన్ని గుర్తుచేసుకున్నారు. ఆయన నాయకత్వంలో అవినీతి రహిత, అభివృద్ధి ఆధారిత పాలన అందిందని, గ్యారంటీ పథకాలతో ప్రజలకు ఆర్థిక సాధికారత కల్పించామని తెలిపారు. అలాంటి గొప్ప నేత కేబినెట్‌లో మంత్రిగా పనిచేయడం గర్వకారణమని ఖర్గే వ్యాఖ్యానించారు.

# ఉద్యోగులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం

-మొదటిపేజీ తరువాయి

ఈ నిధులతో రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి కీలకమైన బకాయిలను ప్రభుత్వం పూర్తిగా చెల్లించింది. రిటైర్డ్ ఉద్యోగుల జనరల్ ప్రావిడెంట్ ఫండ్ బకాయిల మొత్తాన్ని క్లియర్ చేశారు. అదేవిధంగా రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి మే 2025 వరకు పెండింగ్‌లో ఉన్న కమ్యూటేషన్ బకాయిలను కూడా పూర్తిగా చెల్లించారు. ముందస్తు ప్రణాళికలు, పక్కా కార్యాచరణతోనే ఇది సాధ్యమైందని తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. ఇచ్చిన మాట ప్రకారం మిగిలిన రూ. 4,000 కోట్ల బకాయిలను కూడా నిర్ణీత గడువులోగా ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయడానికి తమ ప్రభుత్వం శరవేగంగా కసరత్తు చేస్తోందని వెల్లడించింది. ఉద్యోగుల పట్ల ప్రభుత్వం శ్రద్ధ చూపుతున్నదనడానికి ఇది నిదర్శనమని, ప్రభుత్వం వేగంగా నిర్ణయాలు తీసుకుంటోందని ఉద్యోగ సంఘాల నాయకులు, రిటైర్డ్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# యూపీఎస్‌సీని చూసి నేర్చుకోండి.. నీట్ పేపర్ లీక్ పై 'సుప్రీం' వ్యాఖ్య

-మొదటిపేజీ తరువాయి

యూపీఎస్‌సీని చూసి నేర్చుకోవాలని ఎన్‌టీఏకు సూచించింది. కోర్టు విచారణకు ఎన్‌టీఏ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా హాజరయ్యారు. నీట్ వ్యవస్థ ప్రక్షాళనకు ఏర్పాటైన హైలెవెల్ కమిటీ చైర్మన్, ఇస్రో మాజీ చీఫ్ డా. రాధాకృష్ణన్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్‌టీఏ, డా. రాధాకృష్ణన్ దాఖలు చేసిన అఫిడవిట్‌లను సర్వోన్నత న్యాయస్థానం పరిశీలించింది. కేంద్రం తన ఎఫిడవిట్ దాఖలు చేసేందుకు న్యాయస్థానం అదనపు గడువు ఇచ్చింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి జస్టిస్ నరసింహ మాట్లాడుతూ పేపర్ లీక్‌కు ఆస్కారం కల్పించిన పరిస్థితులు ఏమిటని డా. రాధాకృష్ణన్‌ను ప్రశ్నించారు. గతంలో అనేక రక్షణలను ఏర్పాటు చేసినా పేపర్ ఎలా లీక్ అయ్యిందని అన్నారు. ఇందుకు డా. రాధాకృష్ణన్ బదులిస్తూ పేపర్ సెట్టింగ్ ప్రక్రియలో సమస్య తలెత్తిందని అన్నారు. ప్రస్తుతం ఆ లోపాలనూ సరిదిద్ది వ్యవస్థను మరింత బలోపేతం చేశామని అన్నారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి సమస్య తలెత్తకుండా గతంలో మొత్తం 101 సూచనలు చేశామని చెప్పారు. వాటిల్లో 60 తాత్కాలిక సూచనలను 2025-26 పరీక్ష కోసం ప్రత్యేకంగా రూపొందించినట్టు చెప్పారు. ఇతర మార్గదర్శకాలు కూడా త్వరలో పూర్తిస్థాయిలో అమలవుతాయని చెప్పారు. తప్పు జరిగినప్పుడు బాధ్యత ఎవరిదనే దాని పై స్పష్టత ఉండాలని పేర్కొంది. బాధ్యత ఎవరు తీసుకుంటారనేది తేల్చకుండా ఎన్ని కమిటీలు, మీటింగ్‌లు ఏర్పాటు చేసిన ఫలితం ఉండదని వ్యాఖ్యానించింది. ఇక ఈ అంశంపై సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ పేపర్ లీక్‌పై విచారణ జరుగుతోందని అన్నారు. జూన్ 21న నిర్వహించనున్న పరీక్ష కోసం కొత్త వ్యవస్థలను ఏర్పాటు చేశామని అన్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుందని చెప్పారు. ప్రధాని స్వయంగా ఈ అంశాన్ని పర్యవేక్షిస్తున్నారని కోర్టుకు తెలిపారు.

## ప్రతి ఓటును కాపాడుకోవాలి: మహేశ్ కుమార్ గౌడ్

-మొదటిపేజీ తరువాయి

ఈసీ ప్రారంభించింది. ఈ నేపథ్యంలో ఈ ప్రక్రియ సమయంలో అనుసరించాల్సిన తీరుపై తెలంగాణ కాంగ్రెస్ పార్టీ తమ నేతలకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. గాంధీ భవన్ ప్రారంభమైన ఈ కార్యక్రమంలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ కాంగ్రెస్ కమిటీ మాస్టర్ ట్రైనీలకు ఏఐసీసీ శిక్షణ విభాగానికి సంబంధించిన సౌరభ్, అనూష, నిశాంత్ శిక్షణ ఇస్తున్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ తీసుకున్న మాస్టర్ ట్రైనీలు రాష్ట్రంలోని నియోజకవర్గాల్లో బీఎల్‌ఏలకు శిక్షణ ఇస్తారు. ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు సంఘటన్ సృజన్ అభియాన్ ప్రక్రియను పకడ్బందీగా చేశామని వెల్లడించారు. జిల్లా కమిటీలు, మండల కమిటీలు దాదాపు పూర్తి చేశామని చెప్పారు. పశ్చిమబెంగాల్ లో 93 లక్షల ఓట్లను తొలగించారని.. బీజేపీ చేసిన కుట్రలతో అక్కడ ప్రభుత్వమే మారిపోయిందని మండిపడ్డారు. తెలంగాణలో అలాంటి కుట్రలు జరగకుండా చూసుకోవాలని సూచించారు. ప్రతి ఓటును కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని చెప్పారు.

# పవన్ కల్యాణ్ పై జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఫైర్

-మొదటిపేజీ తరువాయి

రాజకీయ విశ్లేషకుడు ప్రొఫెసర్ కె. నాగేశ్వర్‌ను విమర్శించే స్థాయి, అర్హత పవన్ కల్యాణ్‌కు లేవని అనిరుధ్ రెడ్డి అన్నారు. "దమ్ముంటే తెలంగాణకు వచ్చి ప్రొఫెసర్ నాగేశ్వర్‌ను అరెస్ట్ చేయండి. ఆయన ఇంటి ముందు నేను అడ్డుగా నిలబడతా" అంటూ పవన్‌కు బహిరంగ సవాల్ విసిరారు. తెలంగాణ బిడ్డల జోలికి ఆంధ్రప్రదేశ్ నుంచి ఎవరైనా రావాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని, అవసరమైతే మళ్లీ 'గో బ్యాక్ ఆంధ్ర' ఉద్యమం మొదలవుతుందని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. ఈ సందర్భంగా ఏపీ రాజకీయ నేతల తీరుపై ఆయన మండిపడ్డారు. "మీరంతా ఉండేది హైదరాబాద్‌లో, ఆస్తులు సంపాదించుకునేది ఇక్కడే. మరి అన్ని వేల కోట్లు పెట్టి అమరావతిని ఎందుకు కట్టుకుంటున్నారు?" అని ప్రశ్నించారు. రాజకీయాల కోసం ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టడం సరికాదని, తెలంగాణ ప్రజలను తక్కువ చేసి మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు.


# సంపాదకీయం


## ప్రస్తుత పరిస్థితుల్లో మన బాధ్యత ఏమిటి

ఒక పక్క ముగింపు లేని రష్యా--ఉక్రెయిన్‌ల యుద్ధం, మరోపక్క ఏ మలుపు తిరుగుతుందో తెలియని ఇరాన్‌పై అమెరికా--ఇజ్రాయెల్ యుద్ధం. ఈ పరిస్థితుల్లో రూపాయి విలువ దారుణంగా పడిపోయి నేడో, రేపో సెంచరీ కొట్టే పరిస్థితి వచ్చింది. ప్రభుత్వం రూపాయి విలువ పడిపోవటం ఒక సహజ ప్రక్రియగా భావించిందే కానీ, దాని విలువ పెంచే ప్రయత్నం చేయలేదు. కొంతవరకు అటువంటి ప్రయత్నం చేసిన ఏకైక ప్రధాని పీవీ మాత్రమే. ఆయన ప్రధాని అయ్యే నాటికి దేశంలో విదేశీ మారక ద్రవ్యం అడుగంటిపోయి బంగారం తాకట్టు పెట్టే పరిస్థితి నెలకొన్నది. దీంతో పరిశ్రమల శాఖను తన దగ్గరే పెట్టుకొని 'లైసెన్స్ రాజ్' పద్ధతిని రద్దు చేసి పరిశ్రమలు బలపడేటట్టు చేశారు. దాని ఫలితాలు ఈ రోజున చూస్తున్నాం. రూపాయి విలువ పెరగటానికి ప్రభుత్వాలు ఏ ఆలోచనా చేయకపోవటం దురదృష్టం. డాలర్లతో కొనేవాటి మీద దృష్టి పెట్టి, ఆ డాలరు వాడకాన్ని తగ్గిస్తే రూపాయి బలపడుతుంది. మనం డాలర్లని ఎక్కువ ఖర్చు చేసేది పెట్రోలియం ఉత్పత్తుల కొనుగోలుకు. అది తగ్గాలంటే ప్రజా రవాణా పెరిగి కార్లు, మోటార్ సైకిళ్ళ వాడకం తగ్గాలి. హైదరాబాద్‌లో మెట్రో వచ్చి దశాబ్దమైనా సర్వీసులు పెరగలేదు, కొత్త లైన్లు ఏర్పాటు కాలేదు. ఎందుకు జరగలేదని మనం అడగం ఇక రాజకీయ పార్టీల గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది. తెలంగాణ గత ముఖ్యమంత్రి కేసీఆర్, ప్రధానమంత్రి హైదరాబాద్ వస్తే కనీసం కలిసేవారు కాదు. ఎన్నికలప్పుడు రాజకీయం చేయవచ్చు, కానీ ప్రతి నిమిషం అలాగే ఆలోచిస్తే అభివృద్ధి ఎలా జరుగుతుంది? ఇక ప్రధాన మంత్రిని చూస్తే మా పార్టీని గెలిపిస్తే, డబుల్ ఇంజన్ సర్కారు వస్తే అభివృద్ధి జరుగుతుందని అంటారు. అంటే వేరే పార్టీకి ఓటేస్తే సహాయం చేయం అని అర్థమా? ఇది న్యాయమా? ఇక కాంగ్రెస్‌కు అధికారం లేక పుష్కరం దాటింది. వస్తే ఆలోచిస్తామంటారే కానీ ఇది మేం చేస్తామనే క్లారిటీ లేదు. దగ్గర ఉన్న వనరులు, వాతావరణ పరిస్థితులు ప్రపంచంలో ఎక్కడా లేవు. ఈ రోజున ఒక కారు తయ్యారయ్యే ధర కంటే దాని మీద వేసే పన్నులే ఎక్కువ. కొన్ని పన్నులను తగ్గించుకొని పెట్రోల్ కారు ధరకు బ్యాటరీ కారు అమ్మగలిగితే, డాలర్లతో పెట్రోలియం ఉత్పత్తులను కొనే అవసరం తగ్గుతుంది. యుద్ధం మొదలై 70 రోజులవుతుంటే ఈ రోజు రెండు కార్ల కాన్వాయిలో వెళుతున్నాం, సైకిల్ మీద వెళుతున్నాం, మెట్రోలో వెళుతున్నామనే రాజకీయ నాయకులు.. శాశ్వతంగా ఇలాగే చేయవచ్చు కదా! ఇక గ్యాసు కొరత గురించి ప్రభుత్వం ఇప్పుడు బొగ్గు నుంచి గ్యాసు తయారు చేస్తే ఇన్ని వేల కోట్లు సబ్సిడీ ఇస్తామని ప్రకటన చూస్తే దప్పిక వేసినప్పుడు బావి తవ్వినట్లుంది. దానికి బదులుగా గ్రామాల్లో పంట కోసిన తర్వాత వచ్చే వ్యర్థాలతో తయారుచేసే బ్రిక్వెట్లు చేయించవచ్చు. వాటిని మండలానికి ఒకటి, రెండు ఏర్పాటు చేయిస్తే అక్కడి యువతకు ఉపాధి కలుగుతుంది. రైతులకు మిర్చి కట్టె, పత్తి కట్టె, కంది కట్టె లాంటి వ్యర్థాలను అమ్మటం వల్ల కొంత అదనపు ఆదాయం వస్తుంది. అంతేకాక వాటిని కాల్చినప్పుడు వచ్చే గ్రీన్ హౌస్ వాయువుల వల్ల పర్యావరణం దెబ్బతినకుండా ఉంటుంది. కమర్షియల్ గ్యాసు వాడే వారికి సగం ధరలో ఇవి లభించడంతో గ్యాసు కొనవలసిన అవసరం తగ్గుతుంది. దీనికి కావలసినది రాజకీయ చిత్తశుద్ధి. ఇంకొక ప్రధాన ఖర్చు పప్పు దినుసులు, నూనె కొనుగోళ్ళు. దీనికి ప్రభుత్వమే ఒక పాలసీ తయారు చేసి రైతులకు మంచి రేటు వచ్చేలా సబ్సిడీ ఇచ్చి ప్రోత్సహించాలి. ప్రభుత్వాలు ఆలోచించడానికి ధైర్యం చేయని ఒక విధానం ప్రతిదాన్నీ విదేశీ కంపెనీల నుంచి కొనే మన అలవాటు మార్చే ప్రయత్నం. కనీసం ప్రజలకు ఇలా చేయండి అని చెప్పే ధైర్యం ప్రభుత్వాలు చేయవు, చేస్తే బతకవు. మనకది తెలియదు, చెప్పవలసిన ప్రభుత్వాలు చెప్పవు. అదేమిటంటే ప్రతిదాన్నీ మనం విదేశీ కంపెనీల నుంచి కొంటాం, వాళు ళ్ళ ఆ లాభాలను డాలర్లలో తరలిస్తారు. మన దగ్గర తయారు కానిదాన్ని విదేశీ కంపెనీల నుంచి కొంటున్నామంటే అర్థం ఉంది. కానీ మన దగ్గర నుంచి తీసిన నీటిని విదేశీ కంపెనీల నుంచి ఎందుకు కొనాలి? వాటిని శుభ్రం చేయటానికి లీటరుకు రూపాయి కూడా కాదు, బాటిల్ ఒక ఆరు రూపాయలైతే ఆ నీటిని ఇరవై రూపాయలు పెట్టి కొంటున్నాం, లాభాల్ని ఆ కంపెనీలు డాలర్ల రూపంలో విదేశాలకు తరలిస్తాయి, మనం ఆ డాలర్లను ఎక్కువ రేటుకు తిరిగి కొంటున్నాం. సబ్బులు, పేస్టులు, కూల్‌డ్రింకులు మొదలైనవి ఎందుకు విదేశీ కంపెనీల నుంచి కొనాలి? కోకోకోలా కంపెనీ ఆదాయం గడచిన సంవత్సరంలో 5,042 కోట్లు, పెప్సీ ఆదాయం 9,096 కోట్లు. ఇంకా సబ్బులు తయారు చేసే హిందుస్థాన్ లీవర్ ఆదాయం 16,351 కోట్లు. కాల్గేట్ ఆదాయం 6,548 కోట్లు. ఇలా అన్ని విదేశీ కంపెనీల ఆదాయాన్ని చూస్తే లక్ష కోట్లు దాటుతున్నాయి. వాటి మీద వచ్చే లాభాలను డాలర్లలో తీసుకుపోవటం వల్ల మన రూపాయి బలహీనపడుతున్నది. దీనికి ప్రభుత్వం కూడా ఏమీ చేయలేని పరిస్థితి, ఎందుకంటే ఇది మనలో నుంచి రావాలి. భారతదేశపు కంపెనీల ఉత్పత్తులు ప్రజలు వాడితే ఇక్కడి కంపెనీలు బలపడతాయి, రూపాయి విలువ పెరుగుతుంది. ఈ విదేశీ కంపెనీలకు వ్యతిరేకంగా ఏ ప్రభుత్వమైనా చర్యలకు యత్నిస్తే ఆ ప్రభుత్వాన్ని ఈ కంపెనీలు ఉండనీయవు. మన దేశపు రాజకీయ నాయకులు వాళ్ళ విరాళాలకు ఆశపడి వారికి భూములు, సౌకర్యాలు, సబ్సిడీలు కల్పిస్తారే కానీ, ప్రజలకు నిజాన్ని తెలియనివ్వరు. జరుగుతున్న దానిని ప్రజలు గమనించి, ప్రశ్నించిన రోజునే మన రూపాయి, మన దేశ ప్రతిష్ఠ బలపడుతుంది.

# మోదీ సర్కార్‌కు 'బొద్దింకల' బెదురు






సర్వవ్యాపక జీవి బొద్దింక మన రాజకీయ పరిభాషలో భాగం కావడానికి చాలా కాలం ముందే అది నా పాత్రికేయ పదావళిలో ఒక భాగంగా ఉండేది. జర్నలిజంపై నా ప్రసంగాలలో నేను తరచు పాత్రికేయులను బొద్దింకలతో పోల్చుతూ ఉండేవాణ్ణి. ఎందుకు? రేపు, ప్రపంచం ఒక మహా అణ్వాయుధ దాడికి (అది సంభవించకుండా ఉండుగాక) గురైతే బతికి బయటపడే జీవి బొద్దింక ఒక్కటే కదా. మానవాళి విధ్వంసాన్ని బ్రేకింగ్ న్యూస్‌గా నివేదించేందుకు ఎవరో ఒకరు తప్పనిసరిగా అవసరమవుతారు. ఆ ఎవరో ఒకరు పాత్రికేయులు కాక మరెవరు ?మాజ సమస్యలను పరిష్కరించడంలో దేశ రాజకీయ వ్యవస్థ ఘోర వైఫల్యం పట్ల పెల్లుబుకుతోన్న ఆగ్రహావేశాలను 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) ఆకస్మిక ఆవిర్భావం నిండుగా ప్రతిబింబించింది. పాలనను అవినీతిమయం చేస్తూ ప్రజాస్వామ్యాన్ని పరిహరిస్తున్న భయానక అంధకారాన్ని ఎత్తిచూపేందుకు మురికి తావుల్లో నడయాడే కీటకం బొద్దింకను నిరసనకారులు ఒక ప్రతీకగా తీసుకున్నారు. పాలకులు అంతకంతకూ చక్రవర్తుల్లా ప్రవర్తిస్తున్న ఒక రాజకీయ విశ్వంలో మనం ఉన్నాం. అధికారాలను విచక్షణారహితంగా చెలాయిస్తున్న పాలకులను గట్టిగా ఎదుర్కోలేనిరీతిలో ప్రతిపక్షం చీలిపోయి ఉన్న రాజకీయ విశ్వమది. ఈ వికృత రాజకీయ విశ్వంలోకి బొద్దింక పాకుకుంటూ వచ్చింది. అసహ్యకరమైన కీటకాన్ని చిహ్నంగా స్వీకరించిన ఒక అసాధారణ వ్యంగ్య నిరసన ఉన్నపాటున ఒక ఉద్యమంగా పరిణమించింది. సుదూర అమెరికన్ విశ్వవిద్యాలయంలో ఉన్న ఒక అజ్ఞాత రాజకీయ సందేశ వ్యూహకర్త ఈ ఉద్యమాన్ని ఆరంభించి భారతదేశ అధికార నడవాలలో ప్రకంపనలు సృష్టించాడు. భారత ప్రధాన న్యాయమూర్తి చేసిన (పూర్తిగా అనవసరమైన) 'బొద్దింక' వ్యాఖ్యలు పురికొల్పిన ఆన్‌లైన్ వేలం వెర్రి ప్రపంచ అతి పెద్ద రాజకీయ పార్టీ, మహాశక్తిమంతమైన భారత రాజ్య వ్యవస్థను తీవ్రంగా కలవరపరిచింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఒక కేసు విచారణ సందర్భంగా 'కొంతమంది యువకులు ఉద్యోగాల్లేక, చేస్తున్న పనిలో గుర్తింపు లేక బొద్దింకల్లా అన్ని చోట్లకు విస్తరిస్తున్నారు. వారు మీడియా, సోషల్ మీడియా, ఆర్టీఐ కార్యకర్తలుగా మారి వ్యవస్థలపై దాడి చేస్తున్నారు' అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు ఒక డిజిటల్ తిరుగుబాటుకు దారి తీశాయి. ఆగ్రహం ఆ తిరుగుబాటును ఉసిగొల్పగా వ్యంగ్యం దానికి అసాధారణ శక్తినిచ్చింది. సీజేపీ ఒక రాజకీయ పార్టీ కూడా కాకపోవడం ఈ బొద్దింకల ఉద్యమాన్ని మరింత ఆకర్షణీయమూ, ఆసక్తిదాయకమూ చేస్తోంది. దానికొక నాయకుడు లేడు, ఇంచుమించు 150 కోట్ల ప్రజలతో అపార వైవిధ్యాలతో అలరారుతున్న దేశంలో చాలావరకు సైబర్ స్పేస్‌లోనే జరుగుతున్న ఉద్యమం యథాతథ పరిస్థితులకు ముప్పు కాబోదు. అయినా నరేంద్ర మోదీ నాయకత్వంలోని పాలనా వ్యవస్థ సీజేపీ గురించి ఎందుకు అంతగా ఆందోళన చెందుతోంది? విదేశీ నిధులతో జరుగుతున్న ఉద్యమమని సీజేపీని మోదీ ప్రభుత్వ మంత్రులు విమర్శించారు. దాని అనుయాయుల్లో చాలా మంది పాకిస్థాన్‌లో ఉన్నారని మోదీ సర్కార్ మద్దతుదారులు ఆరోపిస్తున్నారు. సోషల్ మీడియా హ్యాండిల్స్‌కు అవరోధాలు కల్పించారు. వాటిని తమ ఆన్‌లైన్ దాడులకు లక్ష్యంగా చేసుకున్నారు సీజేపీ వెనుక ఆమ్ ఆద్మీ పార్టీ పరోక్ష ప్రమేయమున్నదని పలువురు ఆరోపించారు. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే గతంలో ఆమ్ ఆద్మీ పార్టీ సామాజిక మాధ్యమాలలో పనిచేసినవాడు కావడమే ఆ ఆరోపణకు ఆధారం. అధికారపక్షంలో ఈ ఆందోళనకు నాలుగు కారణాలు ఉన్నాయి. మొదటిది-- తన అధికారాన్ని నిలబెట్టుకునేందుకు రాజకీయ కథనాల నియంత్రణపై పెద్ద ఎత్తున ఆధారపడిన ప్రభుత్వం మోదీ సర్కార్. దాని పాలన రేయింబవళ్ల వాణిజ్య ప్రచారంలా సాగుతోంది: విజయాలను ఘనంగా చెప్పుకోవడం, వైఫల్యాలను పూర్తిగా కప్పిపుచ్చడం, సరికొత్త నినాదంతో ముందుకు సాగడం. ఏటా కోటి ఉద్యోగాల సృష్టి ఒక స్వప్నంగానే మిగిలిపోయింది. రైతుల ఆదాయాలు రెట్టింపు కావడమనేది జరగనే లేదు. ప్రశ్నపత్రాలు లీక్ కావడం ఆగనే లేదు. అయినా ప్రభుత్వ అధ్వాన పనితీరును పాలకుల కథనాలు పూర్తిగా కప్పిపుచ్చుతున్నాయి. అయితే ఇంటర్నెట్ బొద్దింకలు ఈ ప్రభుత్వ కథనాలను విశ్వసించేందుకు నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తున్నారు. ఈ తిరస్కారమే ప్రభుత్వాన్ని తీవ్రంగా కలవరపరుస్తోంది. రెండోది-- యువత ఆగ్రహం. ఎన్నికలలో జయాపజయాలను అది నిర్ణయాత్మకంగా ప్రభావితం చేస్తుందనేది ఎవరూ కొట్టివేయలేని వాస్తవం. జీడీపీ అంకెలు పతాక శీర్షికలవుతున్నాయి. జాతీయవాద భావోద్వేగాలు ఉధృతమవుతున్నాయి. అయినా ఒక అంతులేని అభద్రతా భావంతో నేటి తరం సతమతమవుతోంది. లక్షలాది విద్యావంతులకు ఉద్యోగ అవకాశాలు అంతకంతకూ తగ్గిపోతున్నాయి. పరీక్షల ఒత్తిళ్లు పెరిగిపోతున్నాయి. ఆర్థిక వ్యవస్థ పురోగతి అస్తుబిస్తుగా ఉన్నది. యువ భారతీయులలో నెలకొన్న అసంతృప్తి నైరాశ్యంలోకి జారిపోతోంది. రాజకీయ నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చేందుకు శ్రద్ధ చూపడం లేదన్నది యువత ప్రధాన ఆరోపణ. వారి ఆగ్రహం భావజాలపరమైనది మాత్రమేకాదు, పూర్తిగా వ్యక్తిగతమైనది కూడా. ఇది ఇటీవలి ఎన్నికలలో స్పష్టంగా కన్పించింది. ముఖ్యంగా తమిళనాడులో విజయ్ రాజకీయ సంచలనంలో సంప్రదాయ రాజకీయాల పట్ల యువ ఓటర్ల అసహనం పూర్తిగా ప్రతిబింబించింది. దేశవ్యాప్తంగా యువ ఓటర్లు అంతకంతకూ కాలం చెల్లిన రాజకీయ ద్వంద్వాల – – వామపక్షాలు వర్సెస్ మితవాద పక్షాలు, ఉన్నత వర్గం వర్సెస్ ప్రజాకర్షక వాదం,--ను నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తున్నారు. భవితనిచ్చే నవ్యత, వాస్తవికత, భావోద్వేగ బాంధవ్యాలకోసం వారు ఆరాటపడుతున్నారు. ఇంటర్నెట్ ద్వారా విశాల, విస్తృత సమూహాలను సమీకరించే మీమ్ సంస్కృతి వారి నిరసనను వ్యక్తం చేసే భాషగా మారింది. కాక్రోచ్ జనతా పార్టీకి ప్రాణవాయువుగా ఉన్న ఈ మీమ్ సంస్కృతి, బహుశా ఆ పార్టీకి సంబంధించి చాలా తక్కువగా అర్థం చేసుకున్న విషయమని విశదమవుతుంది. వ్యంగ్యం ఒక రాజకీయ ఆయుధమయింది. నిరంకుశ పాలనా వ్యవస్థలు ఆశ్చర్యకరంగా తరచు ఈ పదునైన శస్త్రాన్ని నెదుర్కోలేక ఆత్మరక్షణలో పడుతుంటాయి. ప్రతిపక్షాల ప్రసంగాలు, టెలివిజన్ చర్చలు, ఆగ్రహ సంపాదకీయాలను అవి సంబాళించుకుంటాయి. ఎందుకంటే అవి సుపరిచితమైన సమరాస్త్రాలే. అయితే పరిహాసాన్ని తట్టుకోవడం చాలా కష్టం. దానిని అణచివేయడం మరీ అసాధ్యం. ఒక పత్రికా ప్రకటన కంటే ఒక మీమ్ వడివడిగా విస్తృత ప్రభావాన్ని నెరపుతుంది. మీమ్ ది కాంతివేగం! చాలా జాగ్రత్తగా పెంపొందించుకుని పటిష్ఠం చేసుకున్న పేరు ప్రతిష్ఠలను ఒక ఎత్తి పొడుపు లేదా పరుషోక్తి ఒక క్షణంలో కూల్చివేస్తుంది. పరిహాసానికి పవిత్ర వస్తువు అనేది ఏమైనా ఉంటుందా? ఉండదు. అధికారం ఎప్పుడైతే ఎగతాళికి గురవుతుందో అప్పుడే దాని ప్రాభవ కాంతులు మసకబారడం ప్రారంభమవుతుంది. మూడోది-- సీజేపీ ఘోషించిన అంశాలన్నీ ప్రగాఢంగా ప్రతిధ్వనిస్తున్నాయి: పెచ్చరిల్లుతోన్న నిరుద్యోగిత; ప్రశ్న పత్రాల లీక్‌లు; పాదుకుపోయిన అవినీతి; అనైతిక పార్టీ ఫిరాయింపులు; ఆప్తులు, ఆశ్రితులు, ఆస్తిపరుల ప్రయోజనాల పరిరక్షణకే పాలనా వ్యవస్థ ప్రాధాన్యమివ్వడం మొదలైనవి. ఈ 'బొద్దింకల' ఉద్యమం ఒక గందరగోళ వ్యవహారంగా కనిపించవచ్చు; అప్పుడప్పుడూ ఆదర్శాల ఆరాటం లేదా నైరాశ్యాల నిరుత్సాహంలో ఉన్న కుర్రకారు కదన కాహళిగా విన్పించవచ్చు గానీ అది అసంఖ్యాక యువత నిజమైన ఆందోళనలే ఆధార భూమికగా ఉన్న అపూర్వ ఉద్యమమది. యువతను పీడిస్తున్న వ్యాకులతలను తొలగించడంలో ఘోరంగా విఫలమైన సంప్రదాయ రాజకీయాలను నిరసిస్తున్న పెనుకేక అది. నాల్గవది-- అంతకంతకూ బలపడుతోన్న ప్రతి నిరంకుశ పాలనా వ్యవస్థ, భిన్నాభిప్రాయాల వ్యక్తీకరణను జాతి వ్యతిరేక చర్యగా చట్టవిరుద్ధం చేసేందుకు ప్రయత్నిస్తుంది. విమర్శను అసమ్మతిగా భావించడానికి బదులు ఒక కుట్రగా పరిగణిస్తుంది. అధికారాన్ని ప్రశ్నించే స్వేచ్ఛ క్రమంగా కుదించుకుపోతూ చివరకు వ్యంగ్య వ్యాఖ్యలను సైతం తన మనుగడకు ముప్పుగా చూడడం ప్రారంభమవుతుంది. ఇదిగో, ఇటువంటి సందర్భాన్నే సీజేపీ సృష్టించింది. ప్రధాన స్రవంతి భావవ్యక్తీకరణ మార్గాలను మూసివేస్తే యువత అనివార్యంగా తమ అసమ్మతిని మరింత అంతరాయం కలిగించే విధ్వంసక పద్ధతులలో వ్యక్తం చేసేందుకు తప్పక పూనుకుంటారు. ఈ దృష్ట్యా, అసహన పాలనా వ్యవస్థ తనకు తానుగా సృష్టించుకున్న తిరుగుబాటు వేదికే కాక్రోచ్ జనతా పార్టీ. ఆసక్తికరమైన విషయమేమిటంటే ఈ 'బొద్దింకల' ఉద్యమ ఉత్థానంలో ప్రతిపక్షానికీ ఒక హెచ్చరిక ఉన్నది. ఆగ్రహావేశాలు యువ భారతాన్ని సంపూర్ణంగా ఆవహించి ఉన్న తరుణమిది. అయితే ఆగ్రహం దానికదే ఒక రాజకీయ మార్పుగా పరిణమించదు. యువ భారతీయుల నిరాశానిస్పృహలను ఒక నిర్మాణాత్మక మార్గంలోకి మళ్లించేందుకు ప్రతిపక్షాలు వివేకవంతంగా సంఘటితమవ్వాలి. విపక్షాలు అలా ఒక వివేకశీల వేదికగా ఏర్పడనంతవరకు యువత శక్తిసామర్థ్యాలు ఒక విస్తృత ప్రజాస్వామిక ఉద్యమంగా ప్రభవించడానికి బదులు మీమ్‌లు, ఆన్‌లైన్ తిరుగుబాటులోనే చిక్కుకుపోతాయి. నేపాల్‌లో జెన్ జడ్ తిరుగుబాటుకు సమాంతరమైనదిగా సీజేపీని చూస్తున్నవారు ఒక వాస్తవాన్ని గుర్తించాలి: పట్టుమని మూడు కోట్ల మంది ప్రజలు కూడా లేని దేశంలో ఉవ్వెత్తున ఎగసిన తిరుగుబాటు తుఫాను ఇంచుమించు 150 కోట్ల జనాభాతో విస్తారంగా సామాజిక, రాజకీయ సంకీర్ణతలు పరిఢవిల్లుతోన్న భారతీయ సమాజంలో చెలరేగడం అసాధ్యం. కాక్రోచ్ జనతా పార్టీగా సంఘటితమవుతోన్న నేటి యువతకు ఒక సంస్థాగత ఉనికి, భావజాలం లేదా వనరులు లేకపోవచ్చు కానీ వారికి అసాధారణ శక్తిసామర్థ్యాలు ఉన్నాయి. సృజనాత్మకత, ఆధిపత్య శక్తుల పట్ల గౌరవ భావ రాహిత్యం, అధికారాన్ని అపహసించే నిర్భీకత వారి సహజ సొత్తులు. బీజేపీ లాంటి శక్తిమంతమైన రాజకీయ సంస్థలు తమ సంప్రదాయ ప్రత్యర్థులను నిర్దయగా ఎదుర్కొని, అణచివేయడం పరిపాటి. అయితే స్పష్టమైన నాయకత్వం, ఒక కేంద్ర కార్యాలయం, మరీ ముఖ్యంగా కోల్పోవడానికి ఏమీలేని వికేంద్రీకృత తిరుగుబాటు ఉద్యమాలతో తలపడడమనేది ఒక కొత్త, వేరు విషయం. ఇదే మోదీ ప్రభుత్వ అసలైన బొద్దింకల సమస్య.

హంస కలం వార్త
శనివారం 30 మే 2026

# జర్నలిస్టుల ఒత్తిడికి మెడిటేషన్ తో పరిష్కారం

-మీడియాస్వేచ్ఛకోల్పోయినా సమాజం బలహీన పడుతుంది ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి
-ఒత్తిడి వల్ల గుండె,రక్తపోటు మెదడుపనితీరు ఆరోగ్యంపై ప్రభావం
-మీడియా ద్వారా సానుకూల మార్పు తీసుకురావాలంటే అంతర్ముఖ శాంతి అవసరం

హంసకలం వార్త

సమాజంలోని వివిధ రంగాలలో అలాగే మీడియా రంగంలో పెరుగుతున్న మానసిక ఒత్తిడి, ఫేక్ న్యూస్, సమాజంలో అశాంతికి కారణమవుతున్నాయని, వీటిని మెడిటేషన్ ద్వారానే శాశ్వతంగా పరిష్కరించుకోగలమని గచ్చిబౌలిలోని శాంతి సరోవర్‌లో శుక్రవారం జరిగిన మీడియా సదస్సులో నిపుణులు అభిప్రాయపడ్డారు బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో మీడియా, మెడిటేషన్ మరియు సామాజిక శాంతి అంశంపై నిర్వహించిన ఈ సదస్సులో దేశం నలుమూలల నుండిసుమారు 100 మంది ఎడిటర్లు, రిపోర్టర్లు, డిజిటల్ కంటెంట్ క్రియేటర్లు పాల్గొన్నారు. మీడియాస్వేచ్ఛకోల్పోయినా సమాజం బలహీన పడుతుంది సోషల్ మీడియా నియంత్రణ లేకపోవడం ఫేక్ న్యూస్ పెరుగుతోందని ఆందోళన ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, మీడియా సమాజానికి నాల్గవ స్తంభమని, దాని బాధ్యత ఎంతో కీలకమని పేర్కొన్నారు. మీడియా స్వేచ్ఛ కోల్పోయినా, అసత్య వార్తలు ప్రచారం చేసినా, విభజన సృష్టించినా సమాజం బలహీనపడుతుంది. రాజయోగ ధ్యానం ద్వారా జర్నలిస్టులు తమలో శాంతిని పెంపొందించుకుంటే, సమాజంలోనూ శాంతిని నెలకొల్పగలరు అని అన్నారు.మీడియా ద్వారా సానుకూల మార్పు తీసుకురావాలంటే అంతర్ముఖ శాంతి అవసరం హైదరాబాద్ జోన్




డైరెక్టర్ బీకే కులదీప్ దీదీ సదస్సును ఆశీర్వదిస్తూ మాటల శక్తి గొప్పదని చెబుతూ, మీడియా ద్వారా సానుకూల మార్పు తీసుకురావాలంటే అంతర్ముఖ శాంతి, పవిత్రత తప్పనిసరి అని సూచించారు. దేవునితో అనుసంధానం ద్వారా ఆత్మబలం పెంచుకుని సమాజానికి సానుకూలత పంచాలని పిలుపునిచ్చారు. జాతీయ మీడియా కోఆర్డినేటర్ బీకే సుశాంత్ భాయిజీ మాట్లాడుతూ, శాంతి మనలోనే ప్రారంభమవుతుంది. ఆత్మజ్ఞానం, పరమాత్మతో అనుసంధానం ద్వారా అంతరంగ శాంతి పొందితే ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కొని బాధ్యతాయుతమైన కంటెంట్ సృష్టించవచ్చు" అని తెలిపారు. ఒత్తిడి వల్ల గుండె,రక్తపోటు మెదడుపనితీరు ఆరోగ్యం పై ప్రభావం ముంబైకి చెందిన డాక్టర్ సచిన్ పరబ్ మీడియా ప్రతినిధులకు ఆరోగ్య సూచనలు చేశారు. ఒత్తిడి వల్ల గుండె, రక్తపోటు, మెదడు పనితీరు దెబ్బతింటుందని చెబుతూ, విశ్రాంతి, సమతుల్య ఆహారం, నియమిత జీవనశైలి, నిద్రకు ముందు మొబైల్ వినియోగం తగ్గించడం అవసరమన్నారు. మానసిక, భావోద్వేగ, శారీరక, సామాజిక ఆరోగ్యాల సమన్వయమే సంపూర్ణ ఆరోగ్యమని వివరించారు. సోషల్ మీడియా నియంత్రణ లేకపోవడం ఫేక్ న్యూస్ పెరుగుతోందని ఆందోళన డక్కన్ క్రానికల్ పొలిటికల్ ఎడిటర్ గా పనిచేసిన సీనియర్ జర్నలిస్ట్ గౌరీ శంకర్ మాట్లాడుతూ, డబ్బు, పేరు కోసం



పరుగులు తీస్తూ మనుషులు శాంతిని కోల్పోతున్నారని అన్నారు. సోషల్ మీడియాలో నియంత్రణ లేకపోవడం వల్ల ఫేక్ న్యూస్ పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బ్రహ్మకుమారీస్ సేవలను ప్రశంసిస్తూ, పిల్లలు, వృద్ధులకు విలువలపై తరగతులు నిర్వహించాలని సూచించారు. జామియా మిలియా ఇస్లామియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ సురేష్ వర్మ 'సత్యం, శివం, సుందరం' మరియు 'బహుజన హితాయ, బహుజన సుఖాయ' సూత్రాలను మీడియా పాటించాలని కోరారు. సానుకూల వార్తల ద్వారా మానసిక ఒత్తిడిలో ఉన్నవారికి ఆశ కల్పించవచ్చని తెలిపారు. మౌంట్ అబూ ప్రధాన కార్యాలయం నుండి మీడియా వింగ్ చైర్‌పర్సన్ రాజయోగి బీకే కరుణ భాయ్ జి సందేశాన్ని వీడియో ద్వారా వినిపించారు. సీనియర్ రాజయోగ టీచర్లు సిస్టర్ అంజలి, సిస్టర్ ఉమా రాణి ఒత్తిడి నిర్వహణ, ధ్యాన విధానం, దాని ప్రయోజనాలను వివరించారు. హైదరాబాద్ మీడియా కోఆర్డినేటర్ బీకే కవిత, బి.కె చిత్ర సీనియర్ రాజయోగ ప్రతినిధులు బికె అరుణ్ బి కే వంశీ బాయిజీలు తదితరులు అనేక మంది పాల్గొన్నారు విలువలతో కూడిన మీడియా, అంతరంగ శాంతి సమాజంలో సౌహార్ధాన్ని నెలకొల్పడంలో కీలక పాత్ర పోషిస్తాయని సదస్సు స్పష్టం చేసింది.

# వాహనదారులు రోడ్డు భద్రత నియమాలను పాటించేలా చర్యలు తీసుకోవాలి

-జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

హంసకలం వార్త

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు రోడ్డు భద్రత నియమాలను పాటించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో డిసిపి భాస్కర్,బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ లతో కలిసి పోలీస్,రవాణా, జాతీయ రహదారులు, రోడ్లు భవనాలు, ఆర్.టి.సి.,విద్యుత్, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు,మున్సిపల్ కమిషనర్లు,సంబంధిత అధికారులతో రోడ్డు ప్రమాదాల నివారణపై రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు పటిష్టంగా అమలు చేయాలని, వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాహ్-వీర్ కార్యక్రమంలో భాగంగా జాతీయ రహదారుల పైన ప్రమాదానికి గురైన క్షతగాత్రులను ఆసుపత్రికి తీసుకురావడానికి ఎవరైతే ముందుకు వస్తారో వారికి ప్రభుత్వం ద్వారా పారితోషకం అందించడం జరుగుతుందని,అదే విధంగా జిల్లాలో రహత్ కార్యక్రమంలో భాగంగా 4 ప్రభుత్వ ఆసుపత్రులు, జిల్లా ప్రభుత్వాసుపత్రి, చెన్నూర్,బెల్లంపల్లి, లక్సెట్టిపేట సామాజిక ఆరోగ్య కేంద్రాలు, మెడిలైఫ్,టచ్,అభయ, ఆరోగ్యశ్రీ ప్రైవేటు ఆసుపత్రులలో జాతీయ రహదారుల పైన ప్రమాదానికి గురైన క్షతగాత్రులకు ఉచితంగా వైద్య




సదుపాయాలు అందించడం జరుగుతుందని తెలిపారు.మున్సిపల్ పరిధిలోని రోడ్లపై చెత్త, ఆటంకాలను వెంటనే తొలగించాలని,ట్రాఫిక్ పోలీసు విభాగం రోడ్లపై అనధికార వాహన నిలుపుదల,నిబంధనల ఉల్లంఘన పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.రోడ్లపై తక్కువ ఎత్తు గల బీమ్‌లు, తక్కువ విజిబిలిటీ ఉన్న చోట్ల లైటింగ్ ఏర్పాటు చేయాలని,జాతీయ రహదారులపై రంబుల్ స్ట్రిప్స్, లైటింగ్, జాగ్రత్త సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు.రోడ్లపై అదుపు తప్పిన,ఓవర్ లోడెడ్ వాహనాలు, పరిమితికి మించి వేగంగా వెళ్లే వాహనాలపై చర్యలు తీసుకోవాలని,ట్రాఫిక్ పోలీసు అధికారులు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరి చేయడంలో కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలో రోడ్డు భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని,గ్రామీణ ప్రాంతాలలో అంతర్గత రహదారులలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని, రహదారులపై కేజ్ వీల్స్, ట్రాక్టర్ కేజ్ వీల్స్ వినియోగాన్ని నిలిపివేసేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని,జిల్లా వ్యాప్తంగా వేగ పరిమితి బోర్డులు, హెచ్చరిక బోర్డులు,జాగ్రత్త సూచికలు ఏర్పాటు చేయాలని తెలిపారు. రహ



దారులపై వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు ఏర్పాట్లు చేయాలని, ప్రతి మండల,గ్రామాల పరిధిలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో పట్టుబడిన వారి లైసెన్సులు,రద్దు చేయాలని,వారి వివరాలు, పరిమితికి మించి లోడింగ్ చేసి తనిఖీలలో పట్టుబడిన వాహనాల వివరాలను మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయాలని తెలిపారు.రహదారులపై సంచరించే పశువులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గోశాలకు తరలించాలని తెలిపారు. అంతర్గత రహదారులలో కల్వర్టుల దగ్గర సూచికలు ఏర్పాటు చేయాలని,గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలలో కుక్కల బెడదను నివారించడానికి తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఓవర్ లోడింగ్, మితిమీరిన వేగం,డ్రంక్ అండ్ డ్రైవింగ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్ లపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రహదారి ప్రమాదాలు, మరణాలు తగ్గించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి రెండోవ విడత ఇందిరమ్మ ఇండ్లకు శ్రీకారం కోసం వస్తున్న సందర్భంగా సభ ఏర్పాట్ల పనులను పరిశీలన

హంసకలం వార్త

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జూన్ 1వ తేదీన రెండోవ విడత ఇందిరమ్మ ఇండ్లకు శ్రీకారం చేస్తున్న సందర్భంగా సిర్పూర్ కాగజ్ నగర్ లోని ఎక్స్ రోడ్డు వద్ద జరగబోయే సభ ఏర్పాట్ల పనులను పరిశీలించిన ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కే హరిత,మంచిర్యాల శాసన సభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు,ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్,నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు,ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఆసిఫాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ, ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు ఆసిఫాబాద్ జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షులు విశ్వ ప్రసాద్ రావు.అనంతరం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో పాల్గొని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ...జూన్ 1వ తేదీన జరగబోయే సీఎం రేవంత్ రెడ్డి గారి సభకు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సభకు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు



లేకుండా చేయాలని అధికారులందరికీ పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, ప్రజాప్రతి నిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

-ఎస్.ఐ.ఆర్. కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించాలి..
-ప్రతి ఇంటికి బీఎల్‌వో చేరుకొని పూర్తి స్థాయిలో పరిశీలన చేయాలి..
-డ్రాఫ్ట్ ఓటరు జాబితా సిద్ధం చేసే ముందు ప్రతి అభ్యంతరాలు, క్లెయిమ్‌లపై క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించాలి..
-రాజకీయ పార్టీలతో నిరంతరం సమన్వయం కొనసాగించాలి..
-ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంపై జిల్లా అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్..




హంసకలం వార్త

ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ద్వారా ప్రతి ఓటరు వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలిస్తూ, మ్యాపింగ్ ప్రక్రియ మరింత వేగవంతంగా చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) అంశంపై జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ పి.శ్రీజ, మున్సిపల్ కార్పోరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి ఇప్పటివరకు చేపట్టిన మ్యాపింగ్ వివరాలను మండలాల వారీగా పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని, ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియలో బీఎల్ఓల పని తీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, లక్ష్యాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ఖచ్చితమైన ధృవీకరణ, సరైన డేటా నమోదు, పారదర్శకత తో పని చేయాలన్నారు. ఎస్ఐఆర్ లో భాగమైన మండలాలు, కార్పోరేషన్, మున్సిపాలిటీ సంబంధించి ప్రతి ఓటర్లను మ్యాపింగ్ చేసే విధంగా టార్గెట్ పెట్టుకొని వంద శాతానికి చేరుకోవాలన్నారు. ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ ప్రక్రియను జూన్ 24 నుంచి జులై 25 వరకు చేపట్టనున్నా రన్నారు. ఫారం-6, 7, 8 ద్వారా వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించాలని, మరణించిన ఓటర్ల వివరాలను ధృవీకరించి, తొలగింపు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. బదిలీ ఓటర్లు, మరణించిన ఓటర్ల వివరాలను సక్రమంగా పరిశీలించి, రికార్డులను నవీకరించాలని తెలిపారు. ఓటర్లు అందరూ ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమంలో పాల్గొని సరైన వివరాలు అందించేలా తద్వారా ఖచ్చితమైన ఓటరు జాబితా తయారీలో రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోరారు. బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారమ్‌ల పంపిణీ, సేకరణ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అలాగే ఓటర్లు కూడా ఎలక్షన్ కమిషన్ ఆన్‌లైన్ సేవల ద్వారా తమ వివరాలను నమోదు చేసుకునే అవకాశం ఉందని వివరించారు. అర్హులైన ప్రతి ఓటరును జాబితాలో చేర్చి, అనర్హులైన ఓటర్ల వివరాలను తొలగించే ప్రక్రియను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఎస్ఐఆర్ కార్యక్రమం ద్వారా శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లు, మరణించిన ఓటర్ల వివరాల తొలగింపు, డబుల్ ఎంట్రీలతొలగింపు జరుగుతుందని తెలిపారు. జూన్ 25 నుండి జూలై 24 వరకు బూత్ లెవల్ అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను పూర్తి స్థాయిలో ధృవీకరించాలని ఆదేశించారు. ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని, ప్రతి అర్హమైన ఓటరుని గుర్తించి జాబితాలో చేర్చాలని తెలిపారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా సిద్ధం చేసే ముందు ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఒక కుటుంబ సభ్యులందరూ ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉండేలా చూడాలని, 1200 మంది ఓటర్ల సంఖ్య దాటితే కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రతి బీఎల్‌వో వద్ద ఎన్యుమరేటర్ ఫారాలు తగినంతగా అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. ప్రతి బీఎల్‌వోకు ఎస్ఐఆర్ నిబంధనలు, విధి విధానాలు, ఫీల్డ్ వెరిఫికేషన్ విధానం, ఫారాల నిర్వహణపై పూర్తి అవగాహన, పట్టు ఉండేలా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. శిక్షణ కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు. ముసాయిదా జాబితా ప్రచురణ అనంతరం ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలు, కొత్త క్లెయిమ్‌లు, దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి మాత్రమే నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి దరఖాస్తుపై ఫీల్డ్ స్థాయిలో విచారణ నిర్వహించాలని, ఎటువంటి ఫిర్యాదును నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. జూలై 31 నుండి ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణ జరుగుతుందని, సెప్టెంబర్ 28 వరకు వాటి పరిష్కార ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. తుది ఓటరు జాబితాను అక్టోబర్ 1న ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు. అంతకుముందు శుక్రవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఎస్ఐఆర్ -2026 ప్రక్రియ నిర్వహణ, శిక్షణ, ఇతర అంశాలపై జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారులకు ఉన్నత స్థాయి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించి, దిశానిర్దేశం చేశారు. జిల్లా ఎన్నికల అధికారులు, ఎన్నికల నమోదు అధికారులు, సహాయక ఎన్నికల నమోదు అధికారులు, బిఎల్ఓలు, సూపర్‌వైజర్‌లతో సహా ఎన్నికల అధికారులకు శిక్షణా కార్యక్రమం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. ఖమ్మం కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్డీసీ రాజేశ్వరీ, ఎలక్షన్ సూపరింటెండెంట్ రాజు, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ జయచందర్, అన్సరీ, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు

హంస కలం వార్త HAMSA KALAM VARTA

శనివారం 30 మే 2026

## యువత వ్యాపార రంగంలోకి రావాలి

-జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

-ఎస్సీ,ఎస్టీ హబ్ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

-కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

హంసకలం వార్త



యువత ఉద్యోగాల కోసం మాత్రమే ఎదురు చూడకుండా వ్యాపార రంగంలోకి అడుగుపెట్టి స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పిలుపునిచ్చారు. జాతీయ ఎస్సీ,ఎస్టీ హబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్సీ,ఎస్టీ వ్యాపారవేత్తల అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.జిల్లా అభివృద్ధి చెందాలంటే యువత పారిశ్రామిక రంగంలో రాణించాలని, రాష్ట్ర,దేశ ఆర్థికాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. ఎస్సీ,ఎస్టీ వర్గాలకు ప్రభుత్వం కల్పిస్తున్న రిజర్వేషన్లు,ప్రోత్సాహక పథకాలను సద్వినియోగం చేసుకొని వ్యాపార రంగంలో ముందుకు రావాలని కోరారు.వ్యాపార కేంద్రాలు,పరిశ్రమలు ఎలా ఏర్పాటు చేసుకోవాలి,వ్యాపార నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటనే అంశాలపై చాలా మంది యువతకు సరైన అవగాహన లేదని పేర్కొన్నారు.అలాంటి వారికి మార్గనిర్దేశం చేయడంలో మిక్కి చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని తెలిపారు.విజయం సాధించిన పారిశ్రామిక వేత్తల అనుభవాల నుంచి స్ఫూర్తి పొందడంతో పాటు,వ్యాపారంలో ఎదురైన వైఫల్యాల నుంచి కూడా గుణపాఠాలుగా నేర్చుకోవాలని సూచించారు. యువతలో వ్యాపార దృక్పథాన్ని పెంపొందించి వారిని సమర్థవంతమైన వ్యవస్థాపకులుగా తీర్చిదిద్దేందుకు చేపడుతున్న చర్యలు సమాజ అభివృద్ధికి దోహద పడతాయని అన్నారు.పరిశ్రమల స్థాపనలో అవసరమైన సహకారం అందించేందుకు జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. నిబద్ధత,కృషి,సంకల్పం ఉంటే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని యువతకు సందేశం ఇచ్చారు.ఈ సదస్సులో మాదిగ ఇండస్ట్రియల్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ అధ్యక్షులు తక్కిళ్ళ విప్లవగాంధీ,ఎన్ఎస్ఎస్ హెచ్ఓ ఇంచార్జి ఎస్.సురేష్,ఎన్ఎండిసి డిజిఎం హరి కిషన్,డిఐసి అడిషనల్ డైరెక్టర్ శోభారాణి,టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి దున్న శ్యామ్,ప్రచార కార్యదర్శి ఉమాపతి,కోశాధికారి శ్రీనివాస రాజు, జిల్లా సమన్వయ కర్త పడిదల శంకర్, డైరెక్టర్ దుబ్బా నాగేశ్వర్,మహిళా విభాగం అధ్యక్షురాలు కవిత,నాగేంద్ర గౌడ్, రవివర్మ,పడిదల జానకిరామ్, నమోనా గ్లోబల్ వెంచర్ ఫౌండర్ బొడ్డు రిషి,ఎస్సీ,ఎస్టీ పారిశ్రామిక వేత్తలు,యువత తదితరులు పాల్గొన్నారు.

## ఎంజీయూలో అక్రమ నియామకాల పై విచారణ జరిపించాలి

-ఉన్నత విద్యా మండలి చైర్మన్‌ను కలిసిన ఎంజీయూ విద్యార్థి నాయకులు

-మహాత్మా గాంధీ యూనివర్సిటీలో అక్రమ ఔట్సోర్సింగ్ నియామకాలు రద్దు చేయాలి

-బీఆర్ఎస్వీ యూనివర్సిటీ అధ్యక్షుడు వాడపల్లి నవీన్



హంసకలం వార్త

మహాత్మా గాంధీ యూనివర్సిటీలో ఇటీవల చేపట్టిన ఔట్సోర్సింగ్ నియామకాల్లో భారీ అవినీతి, అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ యూనివర్సిటీ విద్యార్థి సంఘ నాయకులు శుక్రవారం హైదరా బాద్‌లో తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ జిట్టా బాలకృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా విద్యార్థి సంఘ నాయకులు మాట్లాడుతూ... యూనివర్సిటీలో నిర్వహించిన ఔట్సోర్సింగ్ నియామకాలు పూర్తిగా నిబంధనలకు విరుద్ధంగా జరిగాయని తెలిపారు.రోస్టర్ రిజర్వేషన్ విధానం పాటించకుండా, పత్రిక ప్రకటనలు సరైన విధంగా ఇవ్వకుండా,అర్హులైన నిరుద్యోగులకు అవకాశం లేకుండా నియామకాలు చేపట్టారని ఆరోపించారు.ఇప్పటికే ఈ అంశంపై యూనివర్సిటీ వీసీ మరియు రిజిస్ట్రార్‌కు పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా అధికారులు స్పందించకపోవడంతో ఉన్నత విద్యా మండలి చైర్మన్‌ను కలిసి పూర్తి వివరాలు తెలియజేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థి సంఘ నాయకుడు వాడపల్లి నవీన్ మాట్లాడుతూ.. గతంలో నవీన్ మిట్టల్ వైస్ ఛాన్సలర్‌గా ఉన్న సమయంలో కూడా 33 మంది డైలీ వేజ్ ఉద్యోగులను రోస్టర్ రిజర్వేషన్ మరియు పత్రిక ప్రకటనలు లేకుండా అక్రమంగా నియమించారని తెలిపారు.ప్రస్తుతం చేపట్టిన నియామకాలలో కూడా నిరుద్యోగుల వద్ద లక్షల రూపాయలు వసూలు చేసి 100కు పైగా అక్రమ నియామకాలు జరిగాయని ఆరోపించారు. అక్రమాలకు పాల్పడిన ఏజెన్సీపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఆ ఏజెన్సీకి యూనివర్సిటీ లేదా ఇతర ప్రభుత్వ సంస్థల్లో పనులు ఇవ్వకుండా బ్లాక్‌లిస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.అలాగే ప్రస్తుతం జరిగిన నియామకాలను పూర్తిగా రద్దు చేసి,తిరిగి పారదర్శకంగా నోటిఫికేషన్ విడుదల చేసి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించి నాణ్యత కలిగిన విద్యావంతులను ఎంపిక చేయాలని కోరారు.ఈ సందర్భంగా తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ జిట్టా బాలకృష్ణ రెడ్డి విద్యార్థుల ఫిర్యాదులను స్వీకరించి,ఈ అంశంపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకునేలా యూనివర్సిటీ అధికారులతో చర్చిస్తామని హామీ ఇచ్చినట్లు విద్యార్థి నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు పోలగొని శివ,రాజేష్, యశ్వంత్,రామ్,జితేందర్,సంజీవ, నిరుద్యోగ యువకులు పాల్గొన్నారు.

## ప్రతి కేసులో సమగ్ర దర్యాప్తును చేపట్టి నేరస్తులకు శిక్ష పడే విధంగా అధికారులందరూ కృషి చేయాలి

-గంజాయి హాట్ స్పాట్స్ లపై ప్రత్యేక నిఘా..

-మత్తు పదార్థాలు రవాణా చేసిన, సేవించిన కఠిన చర్యలు..

-నెలవారీ నేర సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్...

హంసకలం వార్త





జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు శుక్రవారం జిల్లా పోలీస్ అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సమావేశంలో పాల్గొన్న పోలీస్ అధికారులతో ఎస్పీ గారు మాట్లాడుతూ ప్రతీ కేసులో 'క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్' ద్వారా నేరస్తులకు శిక్షపడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు.కేసుల విచారణలో జాప్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు.పోలీస్ అధికారులంతా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై క్రమశిక్షణా చర్యలు తప్పవని అన్నారు. పెట్రోలింగ్,బ్లూ కోల్ట్స్ వాహనాలతో అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ రోడ్లపై తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.గంజాయి వంటి మత్తు పదార్థాలు రవాణా చేసే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా హాట్ స్పాట్స్ ను గుర్తించి గంజాయిని రవాణా చేసే వ్యక్తులతో పాటు గంజాయిని సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనుమానితులకు గంజాయి రాపిడ్ కిట్ ల ద్వారా పరీక్షలు నిర్వహించాలని దానిలో పాజిటివ్ వచ్చినట్లయితే చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని కోరారు. సైబర్ నేరాల్లో నగదును కోల్పోయిన భాధితులు ఫిర్యాదు చేసినప్పుడు తక్షణమే స్పందించి వారికి అండగా ఉండాలని సూచించారు. డయల్ 100 నకు ఫోన్ రాగానే త్వరితగతిన స్పందించి బాధితులకు అండగా నిలబడాలని సూచించారు.పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వ యం పాటిస్తూ బాధితులకు న్యాయం చేకూరేలా పనిచేయాలని తెలిపారు.మద్యం సేవించి వాహ నాలను నడుపుతూ, ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారి గురించి నిరంతరం వాహన తనిఖీలు చేపట్టి పట్టుబడిన వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ,కొత్తగూడెం డిఎస్పీ ఆదినారాయణ, పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్,మణుగూరు డిఎస్పీ రవీందర్ రెడ్డి,ఇల్లందు డిఎస్పీ వెంకన్న బాబు,డీసిఆర్బీ డిఎస్పీ మల్లయ్య స్వామి భద్రాచలం డిఎస్పి అరుణ్ కుమార్ మరియు జిల్లాలోని సిఐలు,ఎస్సైలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

-రైస్ మిల్లుల వద్దా ధాన్యం 24 గంటల్లో అన్లోడింగ్ చేయాలి

-జిల్లా అదనపు కలెక్టర్ బి. ఎస్.లత

హంసకలం వార్త



రాయికల్ మండలం మైతాపూర్ గ్రామం లోని ప్యాక్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రం మరియు రాయికల్ మండలం లోని శివమని రైస్ మిల్లును జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీమతి బి.ఎస్. లత ఆకస్మికంగా పరిశీలించారు. కేంద్రాలలో జరుగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేగంగా కొనుగోలు ప్రక్రియను కొనసా గించాలని అధికారులకు సూచించారు. కేంద్రాలలో హమలీలు తగిన సంఖ్యలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ధాన్యం లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేసి లారీలను ఆలస్యం లేకుండా మిల్లులకు తరలించాలని ఆదేశించారు. ట్రక్ షీట్ నమోదు, ట్యాబ్ ఎంట్రీలు వంటి అన్ని డాక్యుమెంటేషన్ పనులను సమయానికి పూర్తి చేయాలని, ఎలాంటి పెండింగ్ లేకుండా చూడాలని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాలలో పారదర్శకత పాటించడంతో పాటు రైతులకు సరైన సమాచారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు సమయంలో తేమ శాతం, నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పరిశీలించాలని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎటువంటి అవకతవకలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను హెచ్చరించారు. రైస్ మిల్లులను తనిఖీ చేసి మిల్లర్లు హమాలీల సంఖ్య పెంచాలని ధాన్యం తో వచ్చిన లారీలను 24 గంటల్లోగా అన్లోడ్ అయ్యే విధంగా చూడాలని రైస్ మిల్లర్లు అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకొని ధాన్యం కొనుగోళ్లు సజావుగా, వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ధాన్యం అన్లోడింగ్ లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగార్జున, నాయబ్ తహసీల్దార్ , సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, కేంద్రల నిర్వాహకులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకంలో జాప్యం తగదు

హంసకలం వార్త




బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకం విషయంలో రాజకీయ పార్టీలు జాప్యం చేయకుండా, బీ.ఎల్.ఏ ల నియామకం జాబితాను నిర్ణీత ఫార్మాట్ లో సత్వరమే అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ అమలులో బీ.ఎల్.ఏ ల పాత్ర ఎంతో క్రియాశీలకం అయి నందున వారి నియామకంలో తాత్సారం తగదని హితవు పలికారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శుక్రవారం జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల ఈ.ఆర్.ఓలు, ఏ.ఈ.ఆర్.ఓలతో కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అమలు ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. పారదర్శతతో కూడిన ఓటరు జాబితా రూపకల్పన కోసం ఎన్నికల సంఘం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఎస్.ఐ.ఆర్ ను అమలు చేస్తోందని, ఈ మేరకు నిర్ణీత షెడ్యూల్ ను కూడా వేలువరించిందని గుర్తు చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఎన్నికల సంఘంచే గుర్తింపు కలిగిన అన్ని రాజకీయ పార్టీలు తప్పనిసరిగా బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకుని, నిర్ణీత ఫార్మాట్ లో వారి వివరాలు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని ఈ.ఆర్.ఓలను ఆదేశించారు. బీ.ఎల్.ఏల నియామకం కోసం ఇప్పటికే రాజకీయ పార్టీలను లిఖిత పూర్వకంగా కోరినప్పటికీ, ఇంకనూ వివరాలు అందించలేదని అన్నారు. కేవలం ఒక పార్టీ మాత్రమే రెండు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన బీ.ఎల్.ఏ ల వివరాలు సమర్పించిందని తెలిపారు. ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ అమలుకు సంబంధించి బీ.ఎల్.ఏ లకు శిక్షణ తరగతులు నిర్వహించాల్సి ఉందని, అంతేకాకుండా ముసాయిదా ఓటరు జాబితాలోని అంశాలపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే, బీ.ఎల్.ఏలు వాటిని ప్రస్తావించేందుకు అవకాశం ఉంటుందని కలెక్టర్ సూచించారు. బీ.ఎల్.ఏల తక్షణ నియామకం ఆవశ్యకతను గుర్తిస్తూ, ఆయా పార్టీలు వెంటనే నియామక జాబితాను అందించాలని అన్నారు. కాగా, ఈ.ఆర్.ఓల స్థాయిలో ప్రతీ వారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ అమలు తీరు గురించి వారికి వివరాలు తెలియ జేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో బీ.ఎల్.ఓలు ప్రతి ఇంటిని సందర్శించి ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పూర్తి చేసేలా పర్యవేక్షణ జరపాలని సూచించారు. బీ.ఎల్.ఓ లకు సహకారం అందిం చేందుకు వీలుగా వాలంటీర్లను సమకూర్చాలని, చనిపోయిన, శాశ్వతంగా వలస వెళ్ళిన, రెండు చోట్ల పేర్లు కలిగిన ఓటర్లను మ్యాపింగ్ సందర్భంగా ఖచ్చితంగా గుర్తించేలా చూడాలన్నారు. తప్పులు లేకుండా ఎన్యుమరేషన్ ఫారం ఎలా నింపాలి అనే దానిపై బీ.ఎల్.ఓలకు సమగ్రంగా అర్థమయ్యే రీతిలో శిక్షణ అందించాలని ఆదేశించారు. అన్ని పోలింగ్ బూత్ ల పరిధిలో వీ.ఐ.పీలు, వీ.వీ.ఐ.పీ ఓటర్లు ఉంటే, వారి మ్యాపింగ్ పూర్తయ్యిందా లేదా అన్నది ఈ.ఆర్.ఓలు స్వయంగా పరిశీలన జరపాలని సూచించారు. ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ అమలు తీరు, ప్రగతి గురించి రోజువారీగా ఆన్లైన్ లో వివరాలు పొందుపర్చాల్సి ఉంటుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని సాంకేతిక సిబ్బందిని నియమించుకోవాలని తెలిపారు. మ్యాపింగ్ లో పొరపాట్లకు తావులేకుండా పక్కాగా పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, నిజామాబాద్ నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, నిజామాబాద్ ఆర్.డీ.ఓ రాజేంద్రకుమార్, బాన్సువాడ ఆర్.డీ.ఓ రవీందర్ రెడ్డి, బోధన్ ఆర్డీఓ విజయ, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు, ఏ.ఈ.ఆర్.ఓలు పాల్గొన్నారు.

# రైతు డిస్కమ్ ప్రభుత్వ కుట్ర

-రైతులకు మంచి చేసే నిర్ణయమైతే ఆరు నెలలు ఎందుకు సీక్రెట్ గా ఉంచారు
-డిస్కమ్ లకు వేల కోట్ల బకాయిలు పెట్టి ప్రభుత్వమే ద్రోహం చేసింది
-రైతుల భవిష్యత్ ను ఆగం చేసే ఈ ప్రపోజల్ ను ఈఆర్సీ రిజెక్ట్ చేయాలి
-రైతు డిస్కమ్ పై పబ్లిక్ హియరింగ్ లో టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత

హంసకలం వార్త

రైతు డిస్కం పేరుతో రేవంత్ రెడ్డి సర్కార్ తెలంగాణ రైతాంగాన్ని నట్టేట ముంచే కుట్ర చేస్తోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. రైతులు అడగకుండానే విద్యుత్ సంస్కరణల పేరుతో చేపట్టిన ఈ చర్య రైతుల పాలిట శాపంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ డిస్కమ్ ఏర్పాటు వ్యవసాయంపై ఎంగ్రిన్ చల్లడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు డిస్కమ్ ఏర్పాటుపై తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ శుక్రవారం ఎర్రగడ్డలోని సంస్థ కార్యాలయంలో నిర్వహించిన పబ్లిక్ హియరింగ్ లో కవిత పాల్గొని మాట్లాడారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి రైతులకు మంచి చేసే ఆలోచనలో ఉంటే ఆరు నెలలుగా ఈ విషయాన్ని ఎందుకు దాచి ఉంచిందో చెప్పాలన్నారు. యావత్ తెలంగాణ రైతాంగానికి అన్యాయం చేసే ప్రయత్నాలను మానుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే 1999 నాటి కాల్పుల ఘటనను కొని తెచ్చుకున్నట్లే అవుతుందని హెచ్చరించారు. తెలంగాణ రైతుల భవితవ్యాన్ని నిర్ణయించే ఈ అంశంపై 33 జిల్లాల్లో పబ్లిక్ హియరింగ్ నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఏ విధంగానూ వయిబుల్ కాని ఈ ప్రపోజల్ ను తిరస్కరించాలని ఈఆర్సీకి విజ్ఞప్తి చేశారు.

**1999 నాటి కాల్పుల ఘటన కొని తెచ్చుకోవద్దు**

రైతు డిస్కమ్ పేరుతో ఈ ప్రభుత్వం పచ్చిదగా చేస్తోందని కవిత అన్నారు. ఈ నిర్ణయం మంచిదే అయితే ఆరు నెలల నుంచి ప్రభుత్వం ఎందుకు ఈ అంశాన్ని సీక్రెట్ గా ఉంచిందో చెప్పాలన్నారు. ఈఆర్సీ కారణంగా ఈ అంశం బయటకు వచ్చిందే తప్ప ప్రభుత్వం బయటపెట్టలేదని గుర్తు చేశారు. నిజానికి ఇంతటి కీలకమైన అంశంపై అఖిలపక్ష సమావేశం నిర్వహించి అసెంబ్లీ లో చర్చ పెట్టాలన్నారు. కానీ సీక్రెట్ గా ఇదంతా చేస్తుందంటేనే కచ్చితంగా ఇందులో దురుద్దేశం ఉందన్నది అర్థమవుతుందని కవిత చెప్పారు. రైతులు ఎవరు అడగకుండానే రైతు డిస్కం అవసరమేమొచ్చిందని ఆమె ప్రశ్నించారు. అసలే డిస్కమ్ ల పరిస్థితి బాగాలేని సమయంలో రూ. 25 వేల కోట్ల నష్టంతో ఉన్న డిస్కమ్ ను కంపెనీ పేరుతో ఎలా రిజిస్టర్ చేస్తారని ఆమె నిలదీశారు. రైతులకు ఇచ్చే ఫ్రీ కరెంట్, ఉచిత విద్యుత్ స్కీం, లిఫ్ట్ ఇరిగేషన్ కోసం వాడే పవర్ కు ప్రభుత్వమే డబ్బులు ఇవ్వాల్సి ఉంటుందని గుర్తు చేశారు. అలాంటప్పుడు ఈ సంస్థ ఏ విధంగా లాభాల్లో ఉంటుందో చెప్పాలన్నారు. కేవలం రైతులకు నష్టం చేసేందుకు ఈ పిచ్చి పనిచేస్తున్నారని కవిత విమర్శించారు. రైతులకు అన్యాయం చేస్తే 1999 నాటి కాల్పుల ఘటన పునరావృతం అయ్యే పరిస్థితి ఉంటుందని హెచ్చరించారు. అలాంటి సంఘటనలు కొని తెచ్చుకోవద్దంటే ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

**-రైతులకు నష్టమే**

రైతు డిస్కం కారణంగా మేలు జరగకపోగా రైతులకు మరింత నష్టం వాటిల్లుతుందని కవిత అన్నారు. కొత్త డిస్కం కు 42 శాతం లోడ్ ట్రాన్ ఫర్ చేస్తామని ప్రభుత్వం చెబుతోందని... కానీ అందుకు తగిన విధంగా ఉద్యోగులను మాత్రం కేటాయించటం లేదన్నారు. మొత్తం డిస్కం లలో 45 వేల మంది ఉద్యోగులు ఉంటే కొత్త డిస్కం క్నీ 2 వేల మంది ఉద్యోగులను మాత్రమే ట్రాన్స్ ఫర్ చేస్తామంటున్నారన్నారు. దీని కారణంగా ట్రాన్స్ ఫార్మర్లు రిపేర్ వస్తే రెండు నెలల పాటు ఎదురుచూసే పరిస్థితి ఉంటుందన్నారు. పైగా ఇంతకు ముందు నియోజకవర్గ కేంద్రంలో ట్రాన్ ఫార్మర్ రిపేర్ సెంటర్ ఉంటే ఇప్పుడు అది తాలుకాకు మారే పరిస్థితి ఉంటుందన్నారు. దీంతో రైతులకు నష్టం జరుగుతుందని చెప్పారు. తెలంగాణలో 29 లక్షల బోర్లు ఉన్నాయని ఈ కొత్త డిస్కం కారణంగా ఆయా బోర్ల పరిస్థితి డోలాయామనంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

**-ప్రభుత్వమే దోషి**

డిస్కమ్ ల పరిస్థితి బాగాలేదని ప్రభుత్వమే చెబుతోందని కవిత గుర్తు చేశారు. మన డిస్కమ్ లకు మైనస్ సీ రేటింగ్ ఉందని అంటున్నారని కానీ దానికి ఈ ప్రభుత్వమే కారణమని మండిపడ్డారు. డిస్కం ల బకాయిలు రూ. 69 వేల కోట్లు ఉంటే అందులో 54 వేల కోట్ల బకాయిలు ప్రభుత్వం నుంచే రావాల్సి ఉందన్నారు. ప్రభుత్వం ఇవ్వాల్సిన బకాయిలు చెల్లిస్తే మన డిస్కమ్ లు మంచి రేటింగ్ లలోకి వస్తాయని చెప్పారు. పైగా కొత్త డిస్కం కు యూనిట్ 6 రూపాయలు ఖర్చయ్యే థర్మల్ విద్యుత్ ను కేటాయిస్తున్నారని చెప్పారు. దీనికి తోడు కొత్త డిస్కం లో వీలింగ్ ఛార్జీలు కూడా యాడ్ చేస్తామంటున్నారన్నారు. ప్రభుత్వమే ఉచిత విద్యుత్, లిఫ్ట్ ఇరిగేషన్ విద్యుత్, రైతులకు ఇచ్చే విద్యుత్ కు డబ్బులు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే రూ. 54 వేల కోట్లు పెండింగ్ పెట్టిన ప్రభుత్వం కొత్త డిస్కమ్ కు ఎక్కడ నుంచి డబ్బులు ఇస్తుందని ప్రశ్నించారు. ఈ లెక్కన రైతు డిస్కం ఏ విధంగా లాభాల్లో ఉంటుందో చెప్పాలన్నారు. డిస్కంల నష్టాలను సాకుగా చూపి ఒక డిస్కం ను ప్రైవేట్ పరం చేసే కుట్ర చేస్తున్నారన్నారు. అటు రైతుల



మోటార్లకు మీటర్లు పెట్టమని చెప్పి ఇప్పుడు మాత్రం ఆ దిశగా అడుగులు వేస్తున్నట్లు ప్రభుత్వ వైఖరి కనిపిస్తుందన్నారు. విద్యుత్ రంగంలో కేంద్ర ప్రభుత్వం పెట్టిన అన్ని కండిషన్స్ ఒప్పుకునే విధంగా రేవంత్ సర్కార్ చర్యలు చేపడుతోందని కవిత విమర్శించారు.

**-33 జిల్లాల్లో పబ్లిక్ హియరింగ్ నిర్వహించాలి**

తెలంగాణ రైతాంగం భవిష్యత్ ను నిర్ణయించే ఈ అంశాన్ని ఏసీ రూముల్లో కూర్చొని నిర్ణయించటం సరికాదని కవిత అన్నారు. తెలంగాణలోని 33 జిల్లాల్లో పబ్లిక్ హియరింగ్ నిర్వహించాలని ఈఆర్సీని కోరారు. ఈఆర్సీ నుంచి ఎలాంటి అనుమతి రాకుండానే జూన్ 2 నుంచి కొత్త డిస్కం పని ప్రారంభమవుతుందని సీఎం మాట్లాడటం సరికాదని చెప్పారు. రైతు డిస్కం విషయంలో ముందు పైలట్ ప్రాజెక్ట్ చేపట్టాలని కోరారు. గతంలో ఎనర్జీ అడిట్ స్కీమ్ లు ఎప్పుడు కూడా సక్సెస్ కాలేదని కవిత గుర్తు చేశారు. అందుకే ముందు పైలట్ ప్రాజెక్ట్ చేపట్టాలన్నారు. లేదంటే పెద్ద మొత్తంలో ఉన్న రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని హెచ్చరించారు. కొత్త డిస్కమ్ కారణంగా కొత్తగా ఎక్కువ గంటలు కరెంట్ ఇస్తారా? ఇప్పుడున్న డిస్కమ్ లో సమస్యలను పరిష్కరించుకుంటే సరిపోయేదానికి ఎందుకు కొత్త డిస్కమ్ అని కవిత ప్రశ్నించారు. ఎట్టి పరిస్థితుల్లో వాయెబుల్ కానీ ఈ ప్రపోజల్ ను ఈఆర్సీ రిజెక్ట్ చేయాలని కవిత కోరారు.

**-ఆంధ్రా ఉద్యోగుల పెత్తనం వద్దు**

రైతు డిస్కం వద్దే వద్దంటే అందులో ఆంధ్రా ఉద్యోగులకు పెత్తనం కట్టేబెట్టే ప్రయత్నం చేస్తున్నారని కవిత అన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత 24 గంటలు కరెంట్ వచ్చేందుకు తెలంగాణ ఉద్యోగులు కష్టపడితే వారికే కష్టమొచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. 12 వందల మంది తెలంగాణ విద్యుత్ ఉద్యోగులకు నష్టం చేశారని చెప్పారు. అదే సమయంలో ఆంధ్రా నుంచి మన వద్దకు వచ్చిన 17 వందల మంది ఉద్యోగులకు ప్రమోషన్లు ఇచ్చారన్నారు. విభజన చట్టాలను పక్కన పెట్టి ఫోర్స్ ఫుల్ గా ఆంధ్రా ఉద్యోగులను మనకు ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పటికే జెన్ కో, రెడ్ కో, సదరన్ డిస్కమ్ ఇలా అన్నింట్లో ఆంధ్రావాళ్ల పెత్తనమే ఉందన్నారు. తెలంగాణ డిస్కమ్ లలో ఆంధ్రావాళ్ల పెత్తనం ఉండొద్దని కవిత కోరారు. రైతు డిస్కం తప్పనిసరి పరిస్థితుల్లో పెట్టాల్సి వస్తే అందులో తెలంగాణ వాళ్లే ఉండాలని డిమాండ్ చేశారు.

# రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

-తడిసిన ధాన్యం సేకరణకు రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు
-ఇప్పటి దాకా 80 శాతం సేకరణ పూర్తి
-జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్

హంసకలం వార్త

తడిసిన ధాన్యం సేకరణ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని,రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ పేర్కొన్నారు. తంగళ్ళపల్లి మండలం అంకుసాపూర్ గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని క్షేత్ర స్థాయిలో సందర్శించారు.ఇప్పటివరకు సేకరించిన ధాన్యం,తూకం వేసి తరలించడానికి సిద్ధంగా ఉన్న బస్తాల వివరాలను కొనుగోలు కేంద్రం నిర్వాహకులను అడిగి ఆరా తీశారు.జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ మాట్లాడుతూ ఈ సారి వరి దిగుబడి, కొనుగోలు కేంద్రాలకు రాక పెరిగిందని,జిల్లాలో నిన్నటివరకు 2 లక్షల 33 వేల 758 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని జిల్లా కలెక్టర్ వెల్లడించారు.ఇప్పటి దాకా 80 శాతం కొనుగోలు చేశామని తెలిపారు. డీఆర్డీఓ,సహకార శాఖ, మెప్మా,పౌర సరఫరాల శాఖ,రవాణా శాఖ ఇతర శాఖల అధికారుల సమన్వయంతో కొనుగోలు తుది దశకు చేరుకున్నాయని వెల్లడించారు.కొనుగోలు కేంద్రాలు ధాన్యం, గోదాముల్లో ధాన్యం అన్ లోడింగ్ వేగంగా పూర్తి చేసేలా మండలాలకు ప్రత్యేక



అధికారులు,అన్ లోడింగ్ వద్ద అధికారులను నియమించి పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు. కొనుగోళ్ల ప్రక్రియ పై ప్రతి రోజు ఉదయం అన్ని శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష చేస్తూ కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా సాగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ వెల్లడించారు.సిరిసిల్ల,తంగళ్లపల్లి మండలాల్లో కొంత వర్షం కురిసిందని,దీంతో తాను తంగళ్ళపల్లి మండలం అంకుసాపూర్ గ్రామంలోని కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించానని పేర్కొన్నారు.తడిసిన ధాన్యాన్ని వెంటనే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించాలని పౌర సరఫరాల శాఖ అధికారిని ఆదేశించారు.రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు .అపరల్ పార్క్, గోదాములకు తరలించి.అక్కడ అన్ లోడింగ్ చేయిస్తున్నామని,హమాలీలకు నీరు,ఆహారం అన్ని వసతులు కల్పిస్తున్నామని తెలిపారు.వర్షం కారణంగా తడిసిన ధాన్యం సేకరణ విషయంలో ఇబ్బందులు లేవని,రైతులు ఈ విషయంలో ఆందోళన చెందవద్దని కలెక్టర్ సూచించారు.తూకం వేసి ఉన్న ధాన్యం బస్తాలను తరలించడానికి వాహనాలను సమకూర్చాలని ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లను ఆదేశించారు.అన్ని శాఖల సమన్వయంతో జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా సాగుతుందని, సాధ్యమైనంత త్వరగా కొనుగోళ్ళు పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పరిశీలనలో జిల్లా సహకార అధికారి రామకృష్ణ,జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బుచ్చిబాబు,మేనేజర్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# బటటస్ట్ అవైలబుల్ స్కీంకు నిధుల గ్రహణం

-నాలుగేళ్లుగా అందని డబ్బులు
-బకాయిలు రూ.13 కోట్లు దాటడంతో చేతులెత్తేస్తున్న ప్రైవేట్ పాఠశాలలు
-ప్రశ్నార్థకంగా 1,500 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల భవిష్యత్తు
-ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు
-బెస్ట్ అవైలబుల్' విద్యార్థులపై ప్రైవేట్ యాజమాన్యాల ఒత్తిడిలి
-సర్కారు నిర్లక్ష్యంతో బడికి దూరమవుతున్న పేద విద్యార్థులు



హంసకలం వార్త

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్యను అందించేందుకు రూపొందించిన బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ (బాస్) పథకం నాలుగేళ్లుగా నిధులు విడుదల కాక విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి నెలకొంది. జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ పథకం కింద చదువుతున్న విద్యార్థులకు సంబంధించిన బకాయిలు విడుదలకాకపోవడంతో వారి భవిష్యత్తు విద్యా ప్రస్థానంగా మారే అవకాశాలు ఉన్నాయి. గత విద్యాసంవత్సరం కొన్ని పాఠశాలలు ప్రభుత్వం బకాయిలు చెల్లిస్తేనే చదువులు చెబుతామని లేదంటే పిల్లలను ఇతర పాఠశాలల్లో చేర్పించుకోవాలని ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థుల తల్లిదండ్రులకు చెప్పిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. ఈ నేపథ్యంలో గత విద్యాసంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులు, తల్లిదండ్రులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలలు సైతం తాము చదువులు చెప్పలేమని ప్రభుత్వానికి అల్టిమేటం ఇవ్వగా కేవలం 25శాతం బకాయిలను మాత్రమే చెల్లించారు. రాష్ట్రవ్యాప్తంగా 30వేల మంది విద్యార్థులు ఈ పథకం కింద చదువుతున్నారు. నాలుగేళ్లుగా ఈ పథకానికి సంబంధించిన బకాయిలు ప్రభుత్వం చెల్లించడంలేదు. జిల్లాలో 1500 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఈ పథకం కింద విద్యాభ్యాసంచేస్తున్నారు. ఒక్కో విద్యార్థికి ఏడాది చదువుతో పాటు వసతి కల్పించేందుకు ప్రభుత్వం రూ.40వేలు చెల్లిస్తుంది. గత నాలుగేళ్లుగా ఈబకాయిలు పెండింగ్‌లో ఉంటున్నాయి. జిల్లాలో ఆరు పాఠశాలలకు ఈ స్కీం కింద ఎంపి చేయగా నిధులు విడుదల కాకపోవడంతో మూడు స్కూళ్లు స్కీం నుంచి వైదొలగగా మరో మూడు స్కూళ్లు ప్రస్తుతం స్కీంలో ఉన్నాయి. ఈ స్కూళ్లకు సంబంధించిన 13 కోట్లపైనే బకాయిలు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. గత విద్యాసంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించగా అధికారులు ప్రైవేట్ పాఠశాలలకు నచ్చజెప్పి విద్యాసంవత్సరం కొనసాగించేలా చేశారు. కానీ నిధులు విడుదలకాకపోవడంతో వచ్చే నూతన విద్యాసంవత్సరం ఈ స్కీం కింద చదువుతున్న విద్యార్థుల భవిష్యత్తుపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి. ఈ విషయంపై అధికారుల నుంచి స్పష్టతలేకపోగా పథకం కొనసాగుతుందా లేదా అనే విషయంలో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

**-నాలుగేళ్లుగా పెండింగ్..**

ఆర్థికంగా వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ పేద విద్యార్థులకు ఉన్నత వర్గాలతో సమానంగా కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు 2004లో బెస్ట్ అవైలబుల్ పథకాన్ని అప్పటి ప్రభుత్వం ప్రారంభించింది. మొదట్లో ఈ పథకానికి నిధుల కేటాయింపు సక్రమంగా జరగగా గత నాలుగేళ్లుగా నిధులు మాత్రం విడుదల కావడంలేదు. 2023 ఎన్నికలకు ముందు గత ప్రభుత్వం నుంచి నిధులువిడుదల కాకపోగా కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం సైతం పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయడంలేదు. దీంతో ఈ స్కీం కింద ఉన్న ప్రైవేట్ పాఠశాలలు అప్పులుచేసి పాఠశాలలను నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో కొన్ని పాఠశాలలు విద్యార్థులను దసరా, సంక్రాంతి సెలవులకు ఇళ్లకు వెళ్లినపుడు తిరిగి రావద్దని కరాఖండిగా చెప్పిన సందర్భాలు ఉన్నాయి. జిల్లాలో 5వ తరగతి నుంచి పదవ తరగతి వరకు ఈ పథకం కింద ఒక్కో తరగతి నుంచి 250 మంది చొప్పున 1500 మంది విద్యార్థులు చదువుతున్నారు. డే స్కాలర్ విద్యార్థులకు ఒక్కొక్కరికి ఏడాదికి రూ. 28వేలు, రెసిడెన్షియల్ విద్యార్థులకు రూ. 40వేలు ప్రభుత్వం చెల్లిస్తుంది. జిల్లాలో ప్రస్తుతం మూడు ప్రైవేట్ పాఠశాలల్లోనే ఈ పథకం కొనసాగుతుంది. రూ. 13 కోట్లపైనే బకాయిలు పెండింగ్‌లో ఉండడంతో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు చేతులెత్తేస్తున్నాయి. విద్యార్థులకు భోజనం, చదువు కొనసాగించలేమని వెంటనే నిధులు విడుదల చేయాలని ప్రైవేట్ పాఠశాలలు కోరుతున్నాయి.

**-విద్యార్థులను ఇంటికి పంపుతున్న యాజమాన్యాలు**

?బెస్ట్ అవైలబుల్ స్కీం కింద చదువుతున్న విద్యార్థులకు సంబంధించిన బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో సెలవులకు ఇంటికి వెళ్లిన విద్యార్థులను మళ్లీ తిరిగి రావద్దని ఇతర స్కూళ్లలో జాయిన్ కావాలని ప్రైవేట్ యాజమాన్యాలు కరాఖండిగా చెబుతున్నాయి. కొన్ని పాఠశాలలు అయితే విద్యార్థులను ఇళ్లకు పంపిన ఘటనలు ఉన్నాయి. ప్రైవేట్ పాఠశాలల ఎదుట విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు ఆందోళన కార్యక్రమాలు చేపట్టిన సందర్భాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పదవ తరగతి పూర్తయిన విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం టీసీ, బోనఫైడ్, మెమోలు అవసరం ఉంటాయి. కానీ ప్రభుత్వం నుంచి బిల్లులు విడుదల కాకపోవడంతో ఆ విద్యార్థుల సర్టిఫికేట్లను ఇచ్చేందుకు ప్రైవేట్ యాజమాన్యాలు ఆసక్తిచూపడంలేదు. విద్యార్థులకు సంబంధించిన ఫీజులలో సగమైనా చెల్లిస్తే తప్ప.. ప్రైవేట్ యాజమాన్యాలు సర్టిఫికేట్లను ఇవ్వడం లేదు. నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఫీజులు చెల్లించలేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఉన్నాయి.

హంస కలం వార్త
HAMSA KALAM VARTA
శనివారం 30 మే 2026

# బిజినెస్

## రూపాయి పతనాన్ని ఆపొద్దు

-అప్పుడే బయటి ఒత్తిళ్లకు సహజ రక్షణ
-రెపో పెంపు ఆఖరి అస్త్రం మాత్రమే
-ఆర్‌బీఐ మాజీ గవర్నర్ సుబ్బారావు




**ముంబై:** డాలర్‌తో రూపాయి మారకం రేటు పతనంపై భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు ఆందోళన వ్యక్తం చేశారు. అయితే ఈ పతనాన్ని అడ్డుకునేందుకు ఆర్‌బీఐ ఇప్పుడే ఎలాంటి చర్యలు తీసుకోవద్దని సూచించారు. రూపాయి మారకం రేటు మరికొంత పతనం అయ్యే వరకు ఎదురు చూడాలని కోరారు. ఇలా చేయడం ద్వారా దిగుమతుల పెరుగుదలతో ఎదురయ్యే చెల్లింపుల సమస్య వంటి బయటి ఒత్తిళ్ల నుంచి సహజ రక్షణ లభిస్తుందన్నారు. పెరిగే ధరల నియంత్రణకు రెపో రేటు పెంచడం మేలనే సూచనలనీ ఆయన తోసిపుచ్చారు. ప్రస్తుత తరుణంలో రిటైల్ ద్రవ్యోల్బణ కట్టడికి వడ్డీ రేట్లు పెంచడం కంటే ద్రవ్య సరఫరా నియంత్రణ చర్యలు మేలన్నారు. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్ష కోసం ఆర్‌బీఐ ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) వచ్చే నెల 3-5 తేదీల మధ్య సమావేశమవుతోంది. ఈ సమావేశంలో కీలక రెపో రేటు పెంపుపైనా ఆర్‌బీఐ నిర్ణయం తీసుకోనుంది. ఈ నేపథ్యంలో ఆర్‌బీఐ మాజీ గవర్నర్ సుబ్బారావు ఈ వ్యాఖ్యలు చేయడం విశేషం. ఆఖరి అస్త్రం కావాలి: డాలర్‌తో రూపాయి మారకం రేటు పతనాన్ని ఆపేందుకు ఆర్‌బీఐకి ద్రవ్య పరపతి విధానం ఆఖరి అస్త్రం కావాలే తప్ప.. తొలి అస్త్రం కాకూడదని సుబ్బారావు స్పష్టం చేశారు. ధరల నియంత్రణకు మరో మార్గం లేదనుకున్నప్పుడు మాత్రమే ఆర్‌బీఐ కీలక రెపో రేటు పెంచాలన్నారు. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో డాలర్‌తో రూపాయి మారకం రేటు ఈ నెల ప్రారంభంలో ఒక దశలో రూ.97.15కు పడిపోయింది. పశ్చిమాసియా యుద్ధం ప్రారంభం నుంచి డాలర్‌తో రూపాయి మారకం రేటు 'బేర్'మంటోంది. ఈ ఏడాది ప్రారంభం నుంచి ఇప్పటి వరకు 6.1 శాతం పతనమైతే, అందులో 5 శాతం గల్ఫ్ యుద్ధం ప్రారంభం నుంచి జరిగింది. ఈ యుద్ధానికి వెంటనే తెరపడకపోతే డాలర్‌తో రూపాయి మారకం రేటు త్వరలోనే సెంచరీ కొడుతుందనే అంచనాలు వినిపిస్తున్నాయి.

# బయటి సవాళ్లను దీటుగా ఎదుర్కొనే స్థితిలో

## భారత ఆర్థిక వ్యవస్థ: ఆర్‌బీఐ




**ఇంటర్నెట్ డెస్క్:** అంతర్జాతీయ అనిశ్చితులతో సవాళ్లు ఎదురవుతున్నా భారత ఆర్థిక రంగ మౌలిక అంశాలు దృఢంగా ఉన్నాయని ఆర్‌బీఐ తన తాజా వార్షిక నివేదికలో పేర్కొంది. ఈ ఏడాది దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందని చెప్పింది. ఈ మేరకు శుక్రవారం భారత రిజర్వ్ బ్యాంకు వార్షిక నివేదికను విడుదల చేసింది. నివేదికలోని వివరాల ప్రకారం, కార్పొరేట్ రంగం, బ్యాకింగ్ రంగం లాభాల్లో ఉండటంతో పాటు మౌలిక వసతుల కల్పనకు భారత్ పెట్టుబడులు వెచ్చిస్తుండటంతో ఈసారి అభివృద్ధికి ఢోకా ఉండదు. అయితే, ఈ ఏడాది ఆర్థికాభివృద్ధికి అంతర్జాతీయ అనిశ్చితులు కొంత ప్రతిబంధకంగా మారాయి. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అభివృద్ధి, ద్రవ్యోల్బణంపై పశ్చిమాసియా ఉద్రిక్తతలు ప్రభావం చూపించనున్నాయి. ఫలితంగా ఆర్థిక అభివృద్ధి ఓ మోస్తరు స్థాయిలో ఉండే అవకాశం ఉంది. అయితే, భారత్ పురోగతి సానుకూలంగానే ఉండనుంది. వివిధ దేశాలతో భారత్ కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాలు కూడా ఆర్థికాభివృద్ధికి చోదక శక్తిగా మారనున్నాయి. ఇక ఎల్ నినో ప్రభావంతో ఈసారి భారత్‌లో వ్యవసాయ ఉత్పాదకత తగ్గే అవకాశం ఉందని కూడా ఆర్‌బీఐ తన నివేదికలో అంచనా వేసింది. ఈ వానాకాలం మలిదశలో హిందూ మహాసముద్రంలో పరిస్థితులు కొంత అనుకూలించి ఎల్ నినో ప్రభావం కొంత తగ్గవచ్చని కూడా ఆర్‌బీఐ అంచనా వేసింది. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో దేశీయంగా ఎరువులు, ఇతర ముడి సరకుల ధరలపై ఒత్తిడి ఉంటుందని ఆర్‌బీఐ అంచనా వేసింది. ఎరువుల కొరత లేకుండా పలుమార్గాల్లో భారత్ వాటిని సమకూర్చుకుంటున్నందున ఇక్కట్లు తక్కువగా ఉండొచ్చని పేర్కొంది. దేశంలో తగినంత ధాన్యం నిల్వలు, రిజర్వాయర్లల్లో నీటి నిల్వలు ఉండటంతో వ్యవసాయంపై ఎల్ నినో ప్రభావం కొంత తగ్గి ఈ ఏడాది ద్రవ్యోల్బణం అదుపులోనే ఉంటుందని ఆర్‌బీఐ అంచనా వేసింది. 2026-31 మధ్య కాలానికి ఆర్‌బీఐ, కేంద్ర ప్రభుత్వం ద్రవ్యోల్బణాన్ని 4 శాతానికి పరిమితం చేయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. డీబీటీ పథకాలు, డొమెస్టిక్ రిటైల్ విభాగంలో డిజిటల్ కరెన్సీని మరింత విస్తరించే యోచనలో తాము ఉన్నట్టు కూడా ఆర్‌బీఐ తెలిపింది.

# ఎల్‌ఎస్‌జీ కెప్టెన్సీకి పంత్ రాజీనామా




లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌కు బిగ్ షాక్ తగిలింది. ఈ సీజన్‌లో లఖ్‌నవూ కు సారథ్యం వహించిన రిషభ్ పంత్ కెప్టెన్సీ నుంచి వైదొలిగాడు. ఈ మేరకు ఫ్రాంఛైజీ 'ఎక్స్' వేదికగా ప్రకటన చేసింది. ఈ ఏడాది ఐపీఎల్ సీజన్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ ఘోరంగా విఫలమైన సంగతి తెలిసిందే. మొత్తం 14 మ్యాచ్‌ల్లో కేవలం నాలుగు మ్యాచ్‌లో గెలిచి పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానంలో నిలిచింది. కెప్టెన్సీ బాధ్యతల నుంచి ఉపశమనం కల్పించాలన్న పంత్ అభ్యర్థనను తాము అంగీకరించినట్లు ఎల్‌ఎస్‌జీ తెలిపింది. 'కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పించాలని రిషభ్ పంత్ చేసిన అభ్యర్థనను ఫ్రాంఛైజీ మర్యాదపూర్వకంగా అంగీకరించింది. ఈ మార్పు తక్షణమే అమల్లోకి వస్తుంది. ఇలాంటి నిర్ణయం తీసుకోవడం అంత ఈజీ కాదు. కెప్టెన్‌గా పంత్ ఇప్పటివరకు ఫ్రాంఛైజీకి బాగా సేవలందించాడు' అని రాసుకొచ్చింది. ప్రస్తుత పరిస్థితుల్లో జట్టును అత్యుత్తమ ప్రమాణాలతో పునర్నిర్మించడంపై తాము దృష్టి పెట్టినట్లు తెలిపింది. 2025 ఐపీఎల్ మెగా వేలంలో పంత్‌ను లఖ్‌నవూ ఫ్రాంఛైజీ ఏకంగా రూ.27 కోట్లతో దక్కించుకున్న సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ఈ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. బ్యాటింగ్ పరంగానూ పంత్ ఆకట్టుకోలేకపోయాడు. గత సీజన్‌లో మొత్తం 14 మ్యాచ్‌ల్లో కేవలం 269 పరుగులు చేసిన అతడు.. ఈ ఏడాది మొత్తంగా 312 పరుగులు సాధించాడు.


# స్పోర్ట్స్

## ప్రశాంతత కావాలని అనిపించినప్పుడల్లా కార్టూన్లు చూస్తాను: వైభవ్




రాజస్థాన్ రాయల్స్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ పేరు క్రికెట్ ప్రపంచంలో మార్మోగుతోంది. ఐపీఎల్ 2026లో అతడు తన అద్భుత ప్రదర్శనతో అందరిని ఆకట్టుకుంటున్నాడు. సీజన్ ప్రారంభం నుంచి ఇటీవల జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్ వరకు వైభవ్ పలు అద్భుత ఇన్నింగ్స్‌లు ఆడి.. పలు రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. 15 ఏళ్ల పిల్లాడు ఈ స్థాయిలో ప్రదర్శన చేయడంపై క్రికెట్ దిగ్గజాలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అయితే, ప్యాట్ కమిన్స్ , జస్ప్రీత్ బుమ్రా , జోష్ హేజిల్‌వుడ్ వంటి స్టార్ బౌలర్లపై విజయం సాధించినప్పటికీ, అతడు ఒక పసివాడిలాగే తన గదిలో కార్టూన్లు చూడటానికి ఇష్టపడతాడట. ఈ విషయాన్ని ఈ చిచ్చర పిడుగే స్వయంగా వెల్లడించాడు. తాజాగా ఓ స్పోర్ట్స్ ఛానల్ వేదికగా వైభవ్ మాట్లాడుతూ.. ప్రపంచంలోని అగ్రశ్రేణి బౌలర్లపై విజయం.. గంట లేదా రెండు గంటల పాటు టెలివిజన్ ముందు గడిపే సమయం ఇచ్చేంత ప్రశాంతత తనకు ఇవ్వదని తెలిపాడు. 'రెండు, మూడేళ్ల క్రితం నేను ఇంట్లో ఉండి మ్యాచ్‌లు ఆడేటప్పుడు లేదా ప్రాక్టీస్ చేసేటప్పుడు ఖాళీ సమయం దొరికినప్పుడల్లా కార్టూన్లు చూసేవాడిని. అవి నాకు చాలా నచ్చేవి. ఇప్పుడు కూడా, నాకు విశ్రాంతి లేదా ప్రశాంతత కావాలని అనిపించినప్పుడల్లా కార్టూన్లు చూస్తాను. నా గదిలో హాయిగా కూర్చుని నచ్చిన కార్టూన్లు చూస్తాను. అలా చూడటం నాకు చాలా బాగుంటుంది. అలానే ఇంటిని గుర్తు చేస్తుంది' అని వైభవ్ వెల్లడించాడు.

# ‘కాలా హిరణ్’... సల్మాన్ జింకల వేట, లారెన్స్ బిష్ణోయ్ తో వైరంపై సినిమా




-మరోసారి వార్తల్లోకి సల్మాన్ ఖాన్ కృష్ణ జింకల వేట కేసు

-క్రైమ్ థ్రిల్లర్, కోర్ట్‌రూమ్ డ్రామాగా ‘కాలా హిరణ్’

-జూన్ 20న టీజర్ విడుదల

బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్ ఖాన్ కృష్ణ జింకల వేట కేసు మరోసారి వార్తల్లోకి వచ్చింది. ఈ కేసు ఆధారంగా తెరకెక్కుతున్న ‘కాలా హిరణ్’ అనే సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఈ చిత్రం సల్మాన్ ఖాన్, గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ మధ్య ఉన్న వైరాన్ని ప్రధానంగా చూపిస్తుండటంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ సినిమా గురించి నిర్మాత అమిత్ జానీ మాట్లాడుతూ.. “1998లో జోధ్‌పూర్‌లోని కకానీ గ్రామంలో జరిగిన కృష్ణ జింక వేట కేసు, ఆ తర్వాత నడిచిన కోర్టు డ్రామా, సల్మాన్ ఖాన్‌కు, లారెన్స్ బిష్ణోయ్‌కు మధ్య నెలకొన్న తీవ్రమైన వైరాన్ని ఈ సినిమాలో చూపిస్తున్నాం. ఇది ఒక క్రైమ్ థ్రిల్లర్, కోర్ట్‌రూమ్ డ్రామాగా సాగుతుంది” అని తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లోని సంభల్, మొరాదాబాద్ వంటి నగరాల్లో ఈ సినిమా షూటింగ్ జరిపినట్టు ఆయన వివరించారు. అప్పట్లో సల్మాన్‌తో పాటు సైఫ్ అలీ ఖాన్, టబు, సోనాలి బింద్రే, సతీష్ షా వంటి నటులు కూడా ఉన్నారని, వేట జరిగిన తీరు, సల్మాన్ అరెస్ట్, శిక్ష వంటి అంశాలను ఈ సినిమాలో ప్రస్తావించినట్టు నిర్మాత పేర్కొన్నారు. బిష్ణోయ్ వర్గానికి చెందిన ప్రజలు కృష్ణ జింకలను పవిత్రంగా భావిస్తారు. ఈ కారణంగానే లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ సల్మాన్‌ను లక్ష్యంగా చేసుకుంది. అక్టోబర్ 2024లో సల్మాన్ సన్నిహితుడు బాబా సిద్ధిఖీని ముంబైలో కాల్చి చంపినప్పుడు, ఆ దాడికి బాధ్యత తమదేనని బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటించుకోవడం గమనార్హం. ఈ పరిణామాల నేపథ్యంలో వస్తున్న ఈ సినిమాపై అంచనాలు పెరిగాయి. జూన్ 20న ‘కాలా హిరణ్’ టీజర్‌ను విడుదల చేయనున్నట్టు చిత్ర బృందం ప్రకటించింది.

# సందీప్ రెడ్డి వంగా నిర్మాతగా “రోమాంచకం”




-యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా ‘రోమాంచకం’

-సినిమా టైటిల్ పోస్టర్‌ను విడుదల చేసిన మేకర్స్

-సోదరుడు ప్రణయ్ రెడ్డితో కలిసి చిత్రాన్ని నిర్మిస్తున్న సందీప్ రెడ్డి

టాలీవుడ్‌లో అర్జున్ రెడ్డి చిత్రంతో దర్శకుడిగా తనకంటూ ఓ ప్రత్యేక మార్క్‌ను క్రియేట్ చేసుకున్న సందీప్ రెడ్డి వంగా, బాలీవుడ్‌లో కబీర్ సింగ్, యానిమల్ చిత్రాలతో సెన్సేషన్ క్రియేట్ చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు తాజాగా ఆయన దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా ‘స్పిరిట్’ అనే చిత్రం తెరకెక్కుతోంది. కాగా సందీప్ రెడ్డి వంగా నిర్మాతగా తన సొంత బ్యానర్‌లో ‘రోమాంచకం’ అనే సినిమాను నిర్మిస్తున్నారు. భద్రకాళి పిక్చర్స్ పతాకంపై సందీప్ రెడ్డి వంగా సమర్పణలో ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తున్న ఈ సినిమాలో సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్ కుమార్ జంటగా నటిస్తున్నారు. వేణుగోపాల్ రెడ్డి ఈ చిత్రానికి దర్శకుడు. శుక్రవారం ఈ చిత్రం టైటిల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ‘రోమాంచకం’ టైటిల్‌తో వస్తున్న ఈ చిత్రానికి ప్రేమ, హాస్యం, ఉత్కంఠ అనే ట్యాగ్‌లైన్‌ను జోడించారు. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని అప్‌డేట్స్ త్వరలో అధికారికంగా ప్రకటించనున్నారు.

# చార్టర్డ్ విమానం వదిలి...

## సాధారణ విమానాల్లో ప్రయాణిస్తున్న అల్లు అర్జున్!

-ప్రైవేట్ జెట్‌లకు బదులు కమర్షియల్ ఫ్లైట్లలో అల్లు అర్జున్

-‘రాకా’ సినిమా షూటింగ్ కోసం హైదరాబాద్-ముంబై మధ్య ప్రయాణాలు

-ఇటీవల కమల్ హాసన్ కూడా ఇదే తరహాలో ప్రయాణించడంపై చర్చ

-సినిమా నాణ్యతకే ప్రాధాన్యమిస్తూ, అనవసర ఖర్చులకు దూరం



‘పుష్ప 2: ది రూల్’తో పాన్ ఇండియా స్థాయిలో భారీ విజయం అందుకున్న ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, తన సింప్లిసిటీతో మరోసారి అందరి దృష్టిని ఆకర్షించారు. ప్రస్తుతం ఆయన నటిస్తున్న ‘రాకా’ సినిమా షూటింగ్ నిమిత్తం హైదరాబాద్, ముంబై మధ్య తరచూ ప్రయాణిస్తున్నారు. అయితే, ఈ ప్రయాణాల కోసం ప్రైవేట్ చార్టెడ్ విమానాలకు బదులు, సాధారణ కమర్షియల్ ఫ్లైట్లలోనే ప్రయాణిస్తుండడం గమనార్హం. ‘పుష్ప 2’ సక్సెస్ నేపథ్యంలో, నిర్మాతలు అల్లు అర్జున్ కోసం లగ్జరీ ప్రయాణ సౌకర్యాలు ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ, ఆయన వాటిని సున్నితంగా తిరస్కరించినట్లు తెలుస్తోంది. అనవసరమైన ఖర్చులకు దూరంగా ఉంటూ, ఆ బడ్జెట్‌ను సినిమా నాణ్యతను పెంచేందుకు ఉపయోగించాలని ఆయన భావిస్తున్నట్లు సమాచారం. అందుకే, సాధారణ విమాన సర్వీసుల షెడ్యూల్‌కు అనుగుణంగా తన ప్రయాణాలను ప్లాన్ చేసుకుంటున్నారు. ఇటీవల ‘కల్కి 2’ సినిమా షూటింగ్ కోసం ప్రముఖ నటుడు కమల్ హాసన్ కూడా ఎకానమీ క్లాస్‌లో ప్రయాణించారు. ఇప్పుడు అల్లు అర్జున్ కూడా అదే తరహాలో ఆలోచించడంపై ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. భారీ బడ్జెట్ సినిమాల నిర్మాణ వ్యయం పెరుగుతున్న తరుణంలో, అగ్ర తారలు ఇలా బాధ్యతాయుతంగా వ్యవహరించడం మంచి పరిణామమని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. వ్యక్తిగత విలాసాల కంటే వృత్తికి, సినిమాకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చే ఆయన వైఖరికి ఇది నిదర్శనమని అంటున్నారు.

# ఐవరీ చీరలో అప్సరసలా జాన్వీ.. ‘పెద్ది’ ప్రమోషన్లలో స్పెషల్ అట్రాక్షన్!

-‘పెద్ది’ సినిమా ప్రమోషన్లలో జాన్వీ కపూర్ కొత్త లుక్

-డిజైనర్ అనామికా ఖన్నా రూపొందించిన ఐవరీ శారీలో మెరుపులు

-కేప్-స్టైల్ పల్లుతో సంప్రదాయానికి ఆధునికత జోడింపు

-సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న జాన్వీ లేటెస్ట్ ఫొటోలు

-జూన్ 4న రామ్ చరణ్ ‘పెద్ది’ చిత్రం విడుదల



యువ నటి జాన్వీ కపూర్ తన రాబోయే చిత్రం ‘పెద్ది’ ప్రమోషన్లలో భాగంగా తన స్టైలిష్ లుక్స్‌తో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. తాజాగా ప్రముఖ డిజైనర్ అనామికా ఖన్నా ప్రత్యేకంగా రూపొందించిన ఐవరీ రంగు చీరలో ఆమె అచ్చం దేవకన్యలా కనిపించి ఫ్యాషన్ ప్రియులను మంత్రముగ్ధులను చేశారు. తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ ఫొటోలను పంచుకుంటూ, “హెలో ఫ్రమ్ యువర్ జాను పాపా” అంటూ సరదా క్యాప్షన్‌ను జోడించారు. సున్నితమైన ఎంబ్రాయి డరీతో, షీర్ ఫ్యాబ్రిక్‌పై డిజైన్ చేసిన ఈ చీరలో ఆమె అప్సరసను తలపించారు. ఈ చీరకట్టులో డ్రామాటిక్ కేప్-స్టైల్ పల్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీనికి జత చేసిన స్కాల్ప్డ్ లేస్ బోర్డర్లు సంప్రదాయానికి ఆధునికతను జోడించాయి. దీనికి మ్యాచింగ్‌గా హెవీ ఎంబ్రాయిడరీతో కూడిన స్వీట్‌హార్ట్ నెక్‌లైన్ బ్లౌజ్‌ను ధరించారు. రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో ‘పెద్ది’ చిత్రం తెరకెక్కుతోంది. ఈ యాక్షన్ డ్రామాకు ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. జూన్ 4న ఈ సినిమా విడుదల కానుంది. ప్రమోషన్లలో భాగంగా బెంగళూరు, ఢిల్లీ వంటి నగరాల్లో జాన్వీ తన ఎథ్నిక్ లుక్స్‌తో ఆకట్టుకుంటున్నారు. స్టైలిస్ట్ మేగన్ కాన్సెసియో స్టైల్ చేసిన ఈ లేటెస్ట్ లుక్, ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది.

Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037,
Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449